ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 1 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా) 1-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	40	28
రెంటచింతల	40	28
చీరాల	40	28



ఓ తండ్రి తన కొడుక్కి.. పక్కింటి కుర్రాడి కంటే ఖరీదైన బైక్ కొనిచ్చాడు. ఆ కుర్రాడి కంటే మార్కులు తక్కువ వచ్చినప్పుడు.. 'వాడి కంటే మంచి బైక్ కొనిచ్చాను. ఎక్కువ మార్కులు ఎందుకు రాలేదు..' అని కొడుకుపై తిట్ల పురాణం ఎత్తుకున్నాడు. కానీ, బైక్‌కు, మార్కులకు ఉన్న సంబంధం ఏంటో గుర్తించలేక పోయాడు.

పిల్లల మనసు తెల్లకాగితం లాంటిది. దాని మీద ఏమి రాస్తే.. అదే వారి జీవితం అవుతుంది. రాసేది ఎప్పటికీ చెరిగిపోకుండా.. మంచి పెన్నుతో ఒకేసారి రాయండి. అంతేగాని కావాల్సినప్పుడల్లా చెరిపివేసే పెన్సిల్‌తో రాయకండి.

- రూసో, ఫ్రెంచి తత్వవేత్త(1712-1798)



పోలికలే పసి ప్రాయానికి ప్రమాదం

sunday special

- పిల్లలపై పెరుగుతున్న తల్లిదండ్రుల ఒత్తిడి
- స్పష్టతలేని లక్ష్యాల వేటలో చిన్నారులకు శిక్షణ
- మానసిక వేదనలో కౌమారం
- ఆరోగ్యంపై పడుతున్న ప్రభావం

పెంపకంలో పెరుగుతున్న వ్యత్యాసాలు

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అంతర్జాతీయ స్థాయిలో రాణించి, ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు సాధించింది. ఆమెను స్ఫూర్తి పొందిన చాలా మంది తల్లిదండ్రులు వెంటనే తమ పిల్లలను బ్యాడ్మింటన్ అకాడమీల్లో చేర్పించారు. సమయం కుదరకో.. ఇతర ఇబ్బందుల వల్లనో నాలుగైదు నెలల తరువాత కొంతమంది ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇటీవల ఐపీఎల్‌లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవన్షి రాజస్థాన్ రాయల్స్ తరపును ఎంట్రీ ఇవ్వడంతో.. మరికొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్ అకాడమీలకు శిక్షణ కోసం పంపిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఇతరుల పిల్లలు చదువు, క్రీడలు తదితర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే.. తమ పిల్లలను కూడా అదే స్థాయిలో చూసుకోవాలని చాలామంది తల్లిదండ్రులు భావిస్తారు. వారిని స్ఫూర్తి పొంది ఆయా రంగాల్లో రాణించాలని తమ చిన్నారులకు కొత్త మార్గాలను నిర్దేశిస్తుంటారు. కొంతకాలానికి మరో చోట ఎవరో ఏదో సాధిస్తే.. మీరు కూడా అది నేర్చుకోవాలంటూ అందులో శిక్షణ ఇప్పిస్తుంటారు. తల్లిదండ్రుల ఈ ఆలోచనా ధోరణే.. ప్రస్తుత తరాన్ని గందరగోళంలోకి నెట్టేస్తోంది. తమను ఎలా చూసుకోవాలని అమ్మ నాన్నలు అనుకుంటున్నారో అర్థం కాక.. పసి వయసులోనే.. మానసిక వేదనకు (మిగతా 8వ పేజీలో)

కాల్వలకు కాసులు



నరసరావుపేట : ఇది మైనర్ కాలువే.. కాల్వ కనిపించనంతగా పెరిగిన జమ్ము

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక.. తూటికాడ, నాచుతో నిండిపోయి.. సాగునీరు పారుదలకు అవకాశం లేక అధ్వానంగా మారిన కాల్వలకు మోక్షం కలిగింది. ముందస్తు రుతు పవనాలతో వర్షాలు పడుతుండగా.. పదునెక్కిన పొలాలను రైతులు సాగుకు సిద్ధం చేస్తుండగా.. సాగునీటికి దిగులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించింది. సాగునీటి కాల్వల దుస్థితిపై సమగ్రంగా అవగాహన ఉన్న సాగునీటి సంఘాలకే నిర్వహణ, మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాగునీటి సంఘాలు ముందుకు రాని ప్రాంతాల్లో స్వల్పకాలిక టెండర్లు నిర్వహించి కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆయా మరమ్మతు పనులు సత్వరం చేపట్టాలని రైతు లు కోరుతున్నారు. మరమ్మతు పనులు సక్రమంగా.. సమగ్రంగా జరిగితే ఆయకట్టులోని చివరి భూములకు కూడా పుష్కలంగా సాగునీరు అందే అవకాశం ఉంటుంది. మరి పనులు ఏవిధంగా జరుగుతాయో చూడాలి.

- ఎట్టకేలకు మరమ్మతులకు మోక్షం
- సాగర్ పరిధిలో 801 పనులు గుర్తింపు
- రూ.37.44 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- సాగునీటి సంఘాలకు పనులు కేటాయిస్తూ ఆదేశాలు
- సంఘాలు ముందుకు రాని చోట స్వల్పకాలిక టెండర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, బాపట్ల - ఆంధ్రజ్యోతి)

అధ్వానంగా ఉన్న సాగర్ కాల్వల బాగుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 'కాసుల పారుదల కనిపించడం లేదు' అనే శీర్షికతో కాల్వల అధ్వాన స్థితిపై ఆంధ్రజ్యోతిలో వెలు వడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. రూ.37.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. జల వనరుల శాఖ గుర్తించిన 801 అత్యవసర పనులు చేపట్టేందుకు అధికారులు (మిగతా 6వ పేజీలో)

ఈ పనులు చేపట్టాలి..

- కాల్వల్లో ఐదేళ్లుగా పెరిగిన కంప చెట్లను, అల్లుకుపోయిన జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలను తొలగించాలి.
- పగిలిపోయి దెబ్బతిన్న డ్రాపులు, షట్టర్లకు మరమ్మతులు చేయాలి.
- షట్టర్లు లేక పోవడంతో సాగునీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. వృథాను అరికట్టేందుకు షటర్ల ఏర్పాటు తక్షణావసరం.



తరగతి మారదా?

- గుంటూరులోని కేవీపీ కాలనీలోని కొల్లిశారదా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ దుస్థితి

- మరో పది రోజుల్లో బడులు ప్రారంభం
- పాఠశాలల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు
- అరకొర పనులతో గతేడాది విద్యార్థులకు ఇక్కట్లు
- ఈ ఏడాదీ గదుల కొరతతో ఇబ్బందులు
- తప్పేలా లేవని ఆందోళన
- వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని ఉపాధ్యాయుల ఆవేదన

గుంటూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే గత ఏడాది గదులు కొరత.. పాఠశాల ఆవరణలో నిర్మాణ సామగ్రితో.. విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా నిర్మాణాలు పూర్తి చేసుకుని గదుల కొరత తీరి సాఫీగా బోధన జరుగుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఈ ఏడు కూడా (మిగతా 6వ పేజీలో)

..మరో 3 టీఎంసీలు

- తాగునీటి కోసం కేఆర్ఎంబీ ఆమోదం
- సాగర్ నుంచి నీటి సరఫరా కొనసాగింపు
- రోజుకు 5,500 కూసెక్కులు విడుదల

నరసరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వ వినతి మేరకు కేఆర్ఎంబీ సాగర్ జలాశయం నుంచి మరో మూడు టీఎంసీల నీటిని కేటాయించింది. దీంతో మరో ఐదు రోజుల పాటు సాగర్ నుంచి నీటి విడుదల చేయనున్నారు. తొలుత తాగునీటి కోసం 4 టీఎంసీల నీటిని కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నీటి వినియోగం పూర్తయ్యే లోపు మళ్లీ నీటి కేటాయింపునకు కేఆర్ఎంబీ అదనంగా ఆమోదం తెలిపింది. దీంతో సాగర్ నుంచి నీటి సరఫరాను జలవనరులు శాఖ కొనసాగిస్తోంది. రోజుకు డ్యాం నుంచి 5,500 కూసెక్కుల నీటిని కుడి కాల్వకు సరఫరా చేస్తున్నారు. తాగునీటి కోసం 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ కేఆర్ఎంబీని కోరగా రెండు విడతల్లో ఏడు టీఎంసీలు కేటాయించింది. కుడి కాల్వ పరిధిలోని ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని తాగునీటి నిల్వ చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులను ఎస్ఈ కృష్ణమోహన్ కోరారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సకాలంలో పింఛన్లు

- రాబోయే రోజుల్లో మరింతగా సంక్షేమం అమలు
- పింఛన్ల పంపిణీలో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నా సకాలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం పట్టణంలోని ఎడ్లలింగయ్యకాలనీ, మండలంలోని నందివెలుగు, కఠెవరం గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరింతగా సంక్షేమం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ దివాళా తీయిస్తే కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. పింఛన్లు పెంచుతామని ప్రచారం చేసిన జగన్ మాట తప్పారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ పెంచి అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదని, తాము రోడ్లు వేయించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి జరుగుతున్న మంచిని జీర్ణించుకోలేక కూటమి ప్రభుత్వంపై వైసీపీ విషప్రచారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంపీడీవో అత్తోట దీప్తి తదితరులు పాల్గొన్నారు.



నందివెలుగులో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిలో రౌడీగ్యాంగులు
రెచ్చిపోతున్నాయి

- హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలతో భయభ్రాంతులు
- తెనాలి ఘటనపై ఉన్నతాధికారితో విచారణ : ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీగ్యాంగులు రెచ్చిపోతున్నాయని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ తనిఖీ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రౌడీలు హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కరుడుగట్టిన రౌడీలు లూటీలు, గంజాయి వ్యాపారాలు వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. తెనాలిలో రౌడీషీటర్లకు బహిరంగంగా పోలీసులు లాఠీ కౌన్సిలింగ్ ఘటనపై ప్రశ్నించగా ఆ వీడియో సుమారు రెండు నెలల క్రితం తీసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ ఘటనపై ఏఎస్పీ స్థాయి అధికారితో విచారణ జరిపిస్తున్నామన్నారు. ఈ ఘటనలో ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లు తేలితే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రశాంత పట్టణమైన తెనాలిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా సామాన్యులను భయాందోళనకు గురిచేస్తూ రౌడీయిజం చేస్తున్న గ్యాంగ్‌ల పీచమణుస్తామన్నారు. రౌడీషీటర్లు లడ్డూ, సురేంద్ర, వీరయ్య గ్యాంగ్‌లు పెట్రేగిపోయాయన్నారు. గత ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్ వద్ద అప్పటి ఎమ్మెల్యేతో కలిసి రౌడీషీటర్ సురేంద్ర అతడి అనుచరులు ఓటరుపై దాడికి పాల్పడ్డారన్నారు. గత అక్టోబరు, నవంబరు నెలల్లో రెండుసార్లు రౌడీషీటర్ లడ్డూ దాడులకు పాల్పడ్డాడన్నారు. రౌడీషీటర్ ప్రసాద్ దళిత వర్గానికి చెందిన బాలికను అత్యాచారం చేశాడన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం సన్నగిల్లిన పరిస్థితిల్లో రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 167 మంది రౌడీషీటర్లను గుర్తించి ఆరుగురుపై పీడీయాక్ట్ పెట్టి జైలుకు పంపామన్నారు. కొందరు రౌడీషీటర్లు రాజకీయ రంగు పులుముకుని, కులం కార్డు అడ్డుపెట్టుకుని దందా చేయాలని చూస్తున్నారన్నారు. రౌడీషీటర్లపై తాము తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, లాలాపేట సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చ.. రచ్చ

- ఇళ్ల నిర్మాణాలపై కౌన్సిలర్ల మధ్య వాదులాట
- రూ.10 కోట్ల అవినీతి జరిగిందన్న టీడీపీ కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్ భర్త కౌన్సిల్ హాల్‌కు రావడంతో ఘర్షణ

తెనాలి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్ల పేరుతో పెద్దఎత్తున అవినీతి జరిగింది.. తెనాలిలో పేదలకు ఇల్లు సమకూరకపోగా రూ.10 కోట్లు వరకు దోచేశారు. ఈ అవినీతిపై చర్చించాలి.. అని టీడీపీ కౌన్సిలర్లు, అజెండాలో లేని అంశాలను ఎలా చర్చిస్తాం.. సభా సమయం వృథా అవుతుంది.. అని వైసీపీ కౌన్సిలర్ల వాదులాటలతో శనివారం తెనాలి కౌన్సిల్ సమావేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో మొత్తం 12 అంశాలతో చర్చ ప్రారంభించారు. అయితే తొలిగా వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య చెట్లను నరికి కొందరు దుండగులు అమ్ముకుని సొమ్ముచేసుకున్నారని విచారణకు ఆదేశాలివ్వాలన్నారు. విచారణ జరుపుతామని చైర్‌పర్సన్ చెప్పారు. ఇదే సమయంలో టీడీపీ కౌన్సిలర్లు గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాల పేరుతో జరిగిన దోపిడీపై చర్చించాలని కోరారు. దీంతో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. చైర్‌పర్సన్ సభను వాయిదా వేయగా అదేసమయంలో చైర్‌పర్సన్ భర్త వైసీపీ నాయకుడు తాడిబోయిన రమేష్ కౌన్సిల్ హాల్లోకి వచ్చి అనవసరంగా సభను పక్కదారి పట్టిస్తున్నారంటూ టీడీపీ కౌన్సిలర్లతో వాదనకు దిగారు. దీంతో కాలనీల పేరుతో అవినీతి మయంగా మారి ఇల్లురాక పేదలు అవస్థలు పడుతుంటే చర్చించవద్దంటానికి మీకేమి హక్కుందంటూ టీడీపీ కౌన్సిలర్లు రమేష్‌ను ప్రశ్నించారు. ఇంతలో వైసీపీ కౌన్సిలర్లు అక్కడకు చేరుకుని రమేష్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో ఇరుపక్షాల మధ్య తోపులాట జరిగింది. రమేష్ టీడీపీ కౌన్సిలర్లను దూషించడంతో వాదోపవాదాలు తారస్థాయికి చేరాయి. అనంతరం రమేష్‌ను హాల్ నుంచి బయటకు పంపడంతో తిరిగి కౌన్సిల్ ప్రారంభమైంది. పేదల ఇళ్లకు సంబంధించి కమిషనర్ బండి శేషన్న ఇచ్చిన వివరణపై టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి సంబంధం లేకుంటే సచివాలయ ఉద్యోగులు, మెప్మా విభాగాలు ఎందుకు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో వైసీపీ కౌన్సిలర్లు అడ్డుతగిలే ప్రయత్నం చేశారు. దీంతో వాదోపవాదాలు పెరగడంతో చైర్‌పర్సన్ రాధిక అజెండాలో అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి కౌన్సిల్ ముగిసిందని చెప్పి వెళ్లిపోయారు.



రమేష్‌ను బయటకు పంపుతున్న కౌన్సిలర్లు

పర్యావరణహితంగా మారాలి

రైల్వే డీఆర్ఎం సుధేష్ణసేన్

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి మేలు చేసే పనులను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణసేన్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ పర్యావరణ దినం పక్షోత్సవంలో భాగంగా గుంటూరు రైల్వేస్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రయాణికులకు జూట్ బ్యాగులను డీఆర్ఎం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నివారించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడే జీవనశైలిని అనుసరించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే భావితరాలు సంతోషంగా జీవించగలుగుతాయని చెప్పారు. ప్రయాణికులు వాటర్ బాటిల్స్‌ని విచ్చలవిడిగా కొనుగోలు చేయకుండా ఇళ్ల నుంచి బాటిల్ తెచ్చుకుని వినియోగించుకోవాలని సూచించారు. రైల్వేస్టేషన్‌లో విద్యార్థులు టిక్ టిక్ ప్లాస్టిక్ అనే పర్యావరణ నేపథ్య గీతానికి అనుగుణంగా నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ జేవీ అనూష, సీనియర్ డీఎంఈ రవికిరణ్, డీసీఎం కోఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, డీసీఎం కమలాకర్ బాబు పాల్గొన్నారు.



జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న డీఆర్ఎం సుధేష్ణసేన్



గుంటూరు రైల్వేస్టేషన్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ప్రదర్శన

కరోనాపై అధికారులు అప్రమత్తం కావాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా



స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

గుంటూరు సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కరోనా కేసులు ప్రబల కుండా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. శని వారం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాలు ఒకటి నుండి ఏడు సమావేశాలు జడ్పీ కార్యాలయంలో జరిగాయి. 1, 4, 7 స్థాయి సంఘ సమావేశాలకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించారు. మూడవ స్థాయి సంఘ సమావేశానికి దుర్గి జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, ఐదవ స్థాయి సంఘ సమావేశానికి తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, ఆరవ స్థాయి సంఘ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షత వహించారు. మూడవ స్థాయి సంఘ సమావేశానికి ముందుగా వైస్ చైర్మన్ నర్సిరెడ్డి అధ్యక్షత వహిస్తారని అజెండాలో పేర్కొనగా.. ఆయన గైర్హాజరుతో దుర్గి జడ్పీటీసీ యలమంద సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయా సమావేశాల్లో గ్రామాల్లో నెలకున్న పారిశుధ్యం, డ్రెయినేజీ, సీజనల్ వ్యాధులు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, జల వనరులు, వ్యవసాయం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలను జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కాకుమానులో బాలికల వసతి గృహానికి ప్రహరీ సమస్య, అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘన తదితర అంశాలను జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామన్నారు. వివిధ పనులకు నిధుల విడుదలపై చర్చించారు. 6వ స్థాయి సంఘ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ సాంఘిక సంక్షేమం, ట్రైబల్, బీసీ, మైనారిటీ సంక్షేమం, కార్పొరేషన్లు, డీఆర్డీఏ, వెలుగు తదితర శాఖల అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి చెరువులో పడి చనిపోయిన ఘటనలో హాస్టల్ వార్డెన్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని బీసీ సంక్షేమ అధికారి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ కృష్ణ, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. రెండవ స్థాయి సంఘ సమావేశం కోరం లేక వాయిదా పడింది. మిగిలినవి యథావిధిగా జరిగాయి.

'ఆలపాటి' అనుచరులే కిడ్నాప్ చేశారు

● గుంటూరు తీసుకెళ్లి కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు ● పోలీసులకు ఫిర్యాదు చేస్తా ● శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్

విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనుచరులు నన్ను కిడ్నాప్ చేశారు. ఇక్కడి నుంచి కారులో గుంటూరుకు తీసుకెళ్లి కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు.' అని శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ వంకాయలపాటి శ్రీనివాస్ ఆరోపించారు. శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం విజయవాడలో కిడ్నాప్ అయిన విషయం తెలిసిందే. ఆయన విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాలలో మీడియాతో శనివారం మాట్లాడారు. శాతవాహన కళాశాల స్థల వివాదం 2009లో మొదలైందన్నారు. వంకాయలపాటి కామేశ్వరరావు, బోయపాటి అప్పారావుకి మధ్య సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉందన్నారు. అప్పటికి తన తండ్రి కామేశ్వరరావు కరస్పాండెంట్‌గా ఉన్నారని చెప్పారు. ఆ సమయంలో ఆలపాటి సంస్థలోకి అడుగుపెట్టారని తెలిపారు. ఈ కేసు ఇప్పుడు లిస్ట్ అయిందని, ఆలపాటి రాజేంద్రప్రసాద్ పీఏ రాజేష్‌తోపాటు మరో ఐదుగురు శుక్రవారం తన ఇంటిని పరిశీలించారని ఆరోపించారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయన్నారు. సాయంత్రం తాను ఎంజీ రోడ్డులో వెళ్తుంటే అనుసరించి కిడ్నాప్ చేశారని ఆరోపించారు. తాను ఆలపాటితో మాట్లాడుకుంటానని చెప్పినా వినలేదన్నారు. తనను గుంటూరులోని ఒక పాత భవనం వద్దకు తీసుకెళ్లారని, కాసేపటికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోర్టుకు సమర్పించాల్సిన కాగితాలను తీసుకుని వచ్చి వాటిపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. తన కుమారుడు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ను ట్రాక్ చేశారని, ఈ విషయం తెలుసుకుని తన సెల్‌ను అక్కడున్న వారితో దూరంగా పంపేశారన్నారు. తాను చెప్పినట్టు చేయకపోతే ఇక్కడి నుంచి వెళ్లే పరిస్థితి ఉండదని, ప్రభుత్వం తమదేనని ఆలపాటి బెదిరించారని ఆరోపించారు. తాను కిడ్నాప్ అయిన విషయం మీడియాలో ప్రసారం కావడం, పోలీసులు తన సెల్‌ను ట్రాక్ చేయడంతో తీసుకొచ్చి ఎంజీ రోడ్డులో వదిలిపెట్టారని వివరించారు. తాను పోలీసుల వల్లే ప్రాణాలో బయట పడ్డానని చెప్పారు. తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ ఇవ్వాలని కోరారు. నాలుగు రోజులుగా ఆలపాటి రమ్మని తనకు ఫోన్ చేస్తున్నారని చెప్పారు. తాను రానని చెప్పానని పేర్కొన్నారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు.

కాల్వలకు కాసులు

(5వ పేజీ తరువాయి)

సమాయత్తమవుతున్నారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాల్వల మరమ్మతులు చేపట్టనున్నారు. కాల్వల బాగుకు ప్రభుత్వం నడుంకట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వ పరిధిలో అధ్వానంగా ఉన్న మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వల చివరి భూములకు పూర్తిస్థాయిలో సాగు నీరందించే లక్ష్యంతో పనులు చేపట్టనున్నారు. విత్తనాలు విత్తుకునే సమయం ఆసన్నమయ్యేలోగా కాల్వల్లో పూడికతీతతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టి పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం, సాగునీటి సంఘాలు సమాయత్తమయ్యాయి. నీటి సంఘాలు పనులు చేసేందుకు ముందుకు రాని పక్షంలో అటువంటి చోట్ల రూ.10 లక్షల విలువైన పనులకు స్వల్పకాలిక టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యుద్ధప్రాతిపదికన కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని కూడా కమిషనర్ సూచించారు. రుతు పవనాలు విస్తరించిన నేపథ్యంలో పనులకు ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కొన్ని కాల్వల పనులు ముందస్తుగా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో శనివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి.

పనులు వేగవంతం

డెల్టా పరిధిలో కాల్వల మరమ్మతులకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉండటంతో నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారుల బృందంతో కలిసి ఆయా పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు కూడా చేశారు. రూ.10 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిన చేపట్టే అవకాశం కల్పించడంతో నీటి సంఘాలు పనులకు శ్రీకారం చుట్టాయి. ఎక్స్‌కవేటర్లతో పీటీ ఛానల్, న్యూ ముత్తాయపాలెం, లంక, తుమ్మలశాఖ, అడవిబ్రాంచ్ తదితర కాల్వల మరమ్మతులు జరుగుతున్నాయి. ఇరిగేషన్, డ్రెయినేజి పరిధిలో 109 పనులను రూ.3.01 కోట్లతో చేస్తున్నారు.

సంగం డెయిరీలో నైజీరియా బృందం


నైజీరియా జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్‌కు స్వాగతం పలుకుతున్న సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరి ఉత్పత్తులను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో నైజీరియాలో దిగుమతి చేసుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నైజీరియాలోని జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ ఏ నమాడీ తెలిపారు. శనివారం వడ్లమూడి సంగం డెయిరీని నైజీరియా జిగావా రాష్ట్ర ప్రతినిధి బృందం సందర్శించింది. గవర్నర్ మల్లం ఉమర్ నేతృత్వంలో వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పరుచుకోవడంలో భాగంగా సంగం డెయిరిని సందర్శించారు. ఈ సందర్భంగా మల్లం ఉమర్ బృందానికి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఘన స్వాగతం పలికారు. డెయిరీలోని మార్కెటింగ్, సేల్స్, ప్రాసెసింగ్ యూనిట్‌లను నైజీరియా బృందం పరిశీలించింది. కాకాణి వెంకటరత్నం పశుదాణా కర్మాగారాన్ని సందర్శించారు. మేలైన పశు జాతి వృద్ధి, కృత్రిమ గర్భాధారణ కేంద్రాల స్థాపన తదితర అంశాలపై డెయిరి అధికారులు వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మల్లం ఉమర్ మాట్లాడుతూ నైజీరియాలోని జిగావా రాష్ట్రాన్ని వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రపంచ ఉత్తమ పద్ధతుల్లో అభివృద్ధి చెయడానికి సంగం డెయిరీని ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిగావా రాష్ట్ర ప్రతినిధులు సైపుల్లాహి ఉమర్, అవువాలు షోహరా, డాక్టర్ సులైమాన్ రుఫాయి, డాక్టర్ సలీమ అబ్దుల్లా హీ, అలియా ఇనువా, నాసిరు అహ్మద్, మహ్మద్ దన్యారో, సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ పాల్గొన్నారు.

సోనూసూద్‌కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆహ్వానం

❖ ప్రత్తిపాటి ఫౌండేషన్ సేవలపై ప్రజెంటేషన్


ప్రముఖ నటుడు సోనూసూద్ తో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే31 (ఆంధ్రజ్యోతి): నటనతోనే కాకుండా సేవాకార్యక్రమాలతోనూ నటుడు సోనూసూద్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ట్రిడెంట్ హోటల్లో నటుడు సోనూసూద్‌తో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సోనూసూద్‌కి వివరించారు. పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం గురించి తెలిపారు. వేలాది మందికి నేత్ర వైద్య సేవలు అందించడంపై సోనూసూద్ సంతోషం వ్యక్తంచేసి, ప్రత్తిపాటిని అభినందించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రత్తిపాటి ప్రజంటేషన్ ద్వారా సోనూసూద్‌కి వివరించారు. దీంతో వీలుచూసుకొని చిలకలూరిపేటకు రావాలన్న ప్రత్తిపాటి విజ్ఞప్తికి సోనూసూద్ సానుకూలంగా స్పందించారు. మంచి కార్యక్రమం చేపట్టి, తనకు తెలియజేస్తే తప్పకుండా వస్తానని సోనూసూద్ ప్రత్తిపాటికి హామీ ఇచ్చారు.

ఎస్పీ స్థాయి అధికారికి.. జంట హత్యల కేసు విచారణ

మాచర్లటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసు విచారణ ఉన్నతాధికారుల చేతుల్లోకి వెళ్లింది. హత్యలు జరిగిన వెంటనే సీఐ స్థాయి అధికారితో విచారణ జరపాలని ఉన్నతాధికారులు భావించారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ కేసును ఎస్పీ స్థాయి అధికారికి బాధ్యతలు కల్పించి, మానిటరింగ్ ఐజీ స్థాయి అధికారికి అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో ఏర్పాటు చేసిన బృందాలు విచారణ ముమ్మరం చేశాయి. సోమవారం లేదా మంగళవారం నాటికి కేసు విచారణ ఓ కొలిక్కి వచ్చే అవకాశంఉంది. నిందితులతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తులు, సెల్‌ఫోన్ కాల్ లిస్ట్, నగదు లావాదేవీలు, కుట్రకోణం, సూత్రధారులు ఇలా అన్ని అంశాల్లో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

జడ్పీ ఉద్యోగులకు రేపు కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఉద్యోగులకు సోమ వారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సీఈఓ జ్యోతి బసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 222 పోస్టులకు 198 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల అర్హతలు, నిబంధనలు ఆధారంగా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

రేపటి నుంచి మణిపాల్‌లో వాస్క్యులర్ ఉచిత ఓపీడీ సేవలు

తాడేపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో వాస్క్యులర్ సంబంధిత వ్యాధుల కోసం ఉచిత ఓపీడీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు హాస్పిటల్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నందన్ వేమూరి (కన్సల్టెంట్ వాస్క్యులర్ సర్జన్) జూన్ 2 నుండి 15వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీడీ కన్సల్టేషన్ సేవలు అందించనున్నారన్నారు. వాస్క్యులర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి నిపుణుల ద్వారా వైద్య సలహా అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రద్దీని నివారించేందుకు ముందస్తు అపాయింట్ మెంట్ తీసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. వెరికోస్ వెయిన్స్, మానని గాయాలు, డయాలసిస్ యాక్సిస్ సమస్యలు, కాళ్ల నొప్పులు, తిమ్మిరి సమస్యలు, కాళ్ల రంగు మారడం వంటి సమస్యలను పరీక్షిస్తారని పేర్కొన్నారు. అపాయింట్ మెంట్ కోసం 93929 11288 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

తరగతి మారదా?

(5వ పేజీ తరువాయి)

వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పునః ప్రారంభానికి గడువు ముంచుకొస్తున్నా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు నేడు పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో కొద్దిరోజులు పనుల్లో వేగం పెరిగినా అది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో రాబోయే విద్యా సంవత్సరంలో కూడా తరగతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో రెండు విడతల్లో నాడు నేడు పనులు అనేక పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.1000 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు. అయితే పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికీ అనేక పాఠశాలల్లో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటికీ వందల సంఖ్యలో పాఠశాలల్లో అసంపూర్తి గదుల నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. పూర్తయిన భవనాలకు ప్లాస్టింగ్, విద్యుత్ కనెక్షన్లు, ఫ్లోరింగ్, ప్లంబింగ్ తదితర పనులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో బోధన ఎలా చేయాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయా పనులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. గుంటూరు నగరంలోనే దాదాపు పది పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాలేదంటే మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఒకరోజు ముందుగానే పింఛన్ల వసంతం

● లబ్ధిదారులకు పింఛన్లు అందించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఇంటికి ఒకరోజు ముందుగానే పింఛన్ల వసంతం వచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఒకటో తేదీన ఆదివారం రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందు శనివారమే సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేపట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ నియోజకవర్గంలోని ఆనంద పేట, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే పెన్షన్లు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, పఠాన్ జమీర్, ఉస్మాన్, మజారుద్దీన్, అల్లం బాజీ, శ్రీను నాయక్, రబ్బాని, కోటా పిచ్చిరెడ్డి, ఐలా శ్రీను, బట్ట రాజా, రియాజ్, మల్లికా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేద గుండెకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

పేద గుండెకు ఏ కష్టం రాకుండా అండగా నిలిచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.23 లక్షలు, ఎల్‌ఓసీ కింద రూ.26 లక్షల చెక్కులు మంజూరు చేయించారు. లబ్ధిదారులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్ చెక్కులను స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, శంకూరి శ్రీనివాస్, సలీం, హఫీజ్, దుర్గాప్రసాద్, వాణి, ఏడుకొండలు, ఆంజనేయప్రసాద్, చిన్న బుజ్జి, రబ్బాని, హుస్సేన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ నూరు శాతం పూర్తి కావాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం నాటికే నూరు శాతం కార్యదర్శులు అందించేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ వడ్డె గూడెంలో పింఛన్ల పంపిణీ, లాంచెస్టర్ రోడ్డులో పారిశుధ్య పనులు, జాతీయ రహదారి దగ్గర అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని శనివారం పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ ఆదివారం అయినందున ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అనంతరం లాంచెస్టర్ రోడ్డులో పారిశుధ్య పనులు, జాతీయ రహదారి దగ్గర అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని పరిశీలించి పారిశుధ్య కార్మికులు మధ్యాహ్న సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేసేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఎస్ రాంబాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వెనిగండ్లలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెనిగండ్ల బోసుబొమ్మ సెంటర్‌లోని సీతారామాంజనేయ దేవస్థానంలో జూన్ ఒకటో తేదీ ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు పంచకర్మ వైద్యనిపుణులు రోగులకు నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటిక, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సోరియాసిస్, ఫైల్స్, హెచ్ఐవీ/ఎయిడ్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇస్తారని ఆయన వివరించారు. స్థానిక ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు పొంది నాడీ పరీక్షలు, ఆయుర్వేద మందులు పొందాలని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు కోరారు.

బర్డ్స్ డైరెక్టర్ జగదీష్‌ను అభినందించిన సదాశివరావు



డాక్టర్ జగదీష్‌ను అభినందిస్తున్న సన్నపనేని సదాశివరావు

గుంటూరు మెడికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ అండ్ రీహ్యాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్ (బర్డ్) వైద్యశాల నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సుప్రసిద్ధ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గూడూరు జగదీష్‌ను టీటీడీ బోర్డ్ సభ్యుడు, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావు శనివారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే బర్డ్‌కు కొంత కాలంగా డైరెక్టర్ నియామకం జరగకపోవడంతో వైద్యసేవల్లో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ప్రభుత్వం స్పందించి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్‌ను డైరెక్టర్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో టీటీడీ బోర్డ్ మెంబర్ సదాశివరావు, శనివారం డాక్టర్ జగదీష్‌ను కలసి అభినందనలు తెలిపారు. బర్డ్‌ను వైద్యసేవల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని నన్నపననేని సదాశివరావు ఆకాంక్షించారు. ప్రభుత్వం, టీటీడీ బోర్డ్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని డాక్టర్ జగదీష్ తెలిపారు.

లలిత కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

● వెస్ట్ డీఎస్పీ భానోదయ

గుంటూరు కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): లలిత కళలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని గుంటూరు వెస్ట్ డీఎస్పీ భానోదయ తెలిపారు. శ్రీ లలితా నృత్యాలయ అకాడమీ తృతీయ వార్షికోత్సవం శనివారం అన్నమయ్య కళావేదిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కనుల పండుగగా జరిగాయి. ఈ వేడుకలలో గుంటూరు వెస్ట్ డీఎస్పీ భానోదయ, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ఆలయ పాలక మండలి జాయింట్ సెక్రటరీ ఊటుకూరి నాగేశ్వరరావు అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, చిన్నారులకు జ్ఞాపికలు అందచేశారు. చిన్నారులు చేసిన శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను అల రించాయి. శాస్త్రీయ నృత్య కళ ద్వారా భారతీయ సంస్కృతి వారసత్వపు నిజమైన సారాన్ని ప్రోత్సహించడం, పరిరక్షించడం అభినందనీయమని అతిథులు అన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేసిన డీఎస్పీ భానోదయ, పక్కన విష్ణువర్ధన్ తదితరులు

8న తిరుపతిలో అఖిల భారత బ్రాహ్మణ కరివేన సత్రం ప్రారంభం

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అఖిల భారత బ్రాహ్మణ కరివేన సత్రాన్ని జూన్ 8న ప్రారంభించనున్నట్లు కరివేన సత్రం ఈసీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ తెలిపారు. మారుతీ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ముంటిమడుగు వేణుగోపాల కృష్ణమూర్తి తన తల్లి సుబ్బమ్మ జ్ఞాపకార్థం తిరుపతిలో భూదానానికి రూ.లక్ష, అయోధ్యలో సత్రం భూదానానికి ముంటిమడుగు వేణుగోపాల కృష్ణమూర్తి తన పేరు మీద మరో రూ.లక్ష చెక్కును ఈసీ మెంబర్ కోనూరు సతీష్ శర్మకు శనివారం అందజేశారు.

రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

● ఎలక్ట్రానిక్ కాటా, ఈ-పోస్ యంత్రాలను తనిఖీ చేసిన అధికారులు

● అంతా సవ్యంగా ఉన్న వాటినే సర్టిపై చేసి యాప్‌లో నమోదు

● ప్రతి షాపు వద్ద క్యూఆర్ కోడ్‌తో ప్రజల అభిప్రాయ సేకరణ



గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో జూన్ 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీ కానుండటంతో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని రేషన్ షాపులకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాటాలను తూనికలు, కొలతల శాఖ అధికారులతో పరిశీలన చేయించి సర్టిఫై చేశారు. అలానే ఈ-పోస్ యంత్రాలను విజన్‌టెక్ సిబ్బందితో తనిఖీ చేయించారు. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు అంతా సవ్యంగా ఉందని మొబైల్ అప్లికేషన్‌లో సర్టిఫై చేసి నమోదు చేశారు. చివరగా క్యూఆర్ కోడ్ జనరేట్ చేసి షాపులకు కేటాయించారు. ఎండీయూ వ్యవస్థకు చరమగీతం పాడిన పౌరసరఫరాల శాఖ నేటి ఉదయం 8 గంటల నుంచి రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీని ప్రారంభించనుంది. ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం, చక్కెర, ఇతర సరుకులను రేషన్ దుకాణాలకు చేర్చారు. సరుకుల పంపిణీకి వినియోగించే ఈపోస్ పరికరాలు, ఎలక్ట్రానిక్ కాటాలు చాలావరకు మరమ్మతులకు గురయ్యాయి. వాటన్నింటిని విజన్‌టెక్ సిబ్బంది మరమ్మతులు చేశారు. కొన్ని ఈపోస్ పరికరాల్లో సిమ్‌కార్డులు లేవు. దీంతో కొత్త సిమ్‌కార్డులను తెప్పించి సరఫరా చేస్తామని పౌరసరఫరాల అధికారులు తెలిపారు. కాగా ప్రతి షాపు వద్ద క్యూఆర్ కోడ్‌తో కూడిన బ్యానర్‌ని ఏర్పాటు చేశారు. అందులో ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యవసరాలు అందుబాటులో ఉంటాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచే ఉంటాయి. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుంది. ఏదైనా ఫిర్యాదులు ఉంటే జిల్లా పౌరసరఫరాల అధికారి 8008301439కి ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అలానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మీ అభిప్రాయం కూడా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. డీలర్ ఫోన్ నంబరు, ఫొటోని కూడా ఆ బ్యానర్‌లో చేర్చారు. ఈ విధంగా రేషన్ సరుకుల పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రముని పేర్కొన్నారు. ప్రతి షాపు వద్ద స్టాకు వివరాలు పెట్టాలని, వాటిని సీఎస్‌డీటీలు నిత్యం తనిఖీ చేయాలని ఆదేశించామన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, పక్కన సిబార్ దంత వైద్యులు



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సయ్యద్ రసూల్ తదితరులు

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అనారోగ్యం

● నగరంలో సిబార్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

● జెండా ఊపి ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు కార్పొరేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతారని జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. సిబార్ దంత వైద్య కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆ శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు అంతా కలిసి ప్రజలకు పొగాకు ఉత్పత్తుల వలన కలిగే దుష్పరిణామాలు గురించి అవగాహన కల్పిస్తూ నగరంలో హిందూ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడటం వలన క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడతారని, అందువలన పొగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకం మానేయాలన్నారు. సిబార్ దంత వైద్య కళాశాల ప్రజారోగ్య విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ పొగాకు వాడకం, అరికట్టుట ఎంత ముఖ్యమో పొగాకు సంబంధిత పదార్థాల తయారీని నియంత్రించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున జరిగే ఎన్‌సీడీ సర్వేలలో తాము కూడా పాల్గొని నోటి ఆరోగ్యం, వ్యాధులకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించి సంబంధిత వైద్యంను కూడా అందించి సహకరిస్తామని సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఓరల్ పాథాలజీ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ లలిత్ ప్రకాష్ చంద్ర, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో కేన్సర్ జబ్బులు

గుంటూరు మెడికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు పదార్థాలను ఏ రూపంలో వాడినా ప్రాణాంతక కేన్సర్ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంటుందని కేర్ దంత వైద్య కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం పురస్కరించుకొని కేర్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. గాంధీ పార్క్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీలో దంత వైద్య విద్యార్థులు.. పొగాకును నిషేధిద్దాం.. భావితరాలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో డాక్టర్ సయ్యద్ రసూల్ మాట్లాడుతూ సిగరెట్, బీడీ, ఖైనీ, గుట్కా వంటి వాటికి బానిసై పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేర్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ప్రజారోగ్య దంత వైద్య విభాగాధిపతి డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వలన తీవ్ర అనారోగ్య సమస్యలు

● గుంటూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ సత్యనారాయణ

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చాలా మంది పొగాకు వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని గుంటూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కే వీ సత్యన్నారాయణ అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా 'నేను పొగాకుకు వ్యతిరేకిని' అని సంతకాలసేకరణ, పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బీ రమేష్, రైల్వే సీటీఐ ఎం శ్రీనివాసరావు, హమాలీలు పాల్గొన్నారు

దేశ సమైక్యతకు పాటుపడదాం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

గుంటూరు(తూర్పు), మే 31(ఆంధ్రజ్యోతి): మతాలను, కులాలను రెచ్చగొట్టి పాలన చేస్తున్న నేపథ్యంలో దేశ సమైక్యతకు పాటు పడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో నగర సమితి సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చినప్పుడే యుద్ధం వంటి ఘటనలు జరగడం మోదీ, అమిత్ షా విధానానికి మాయని మచ్చ అని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన గిరిజనులను, ఆదివాసులను పొట్టన పెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో ఏసీలు, టీవీలు చోరీ చేసిన నిందితుల అరెస్టు

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో ఏసీలు, టీవీలను చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం అరండల్‌పేట స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ వివరాలు వెల్లడించారు. విద్యానగర్ 4/2వ లైన్‌కు చెందిన శాంతవరపు నాగార్జున గ్రాండ్ నాగార్జున హోటల్‌లో 20 సంవత్సరాలుగా మేనేజర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఆ హోటల్‌లో రెండు నెలలుగా పునరుద్ధరణ పనుల కారణంగా మూసివేసారన్నారు. 29న ఉదయం గ్రాండ్ నాగార్జున హోటల్ వద్దకు నాగార్జున వచ్చి తాళాలు తెరచి చూడగా అక్కడ ఉన్న వారందరూ పారిపోయారన్నారు. హోటల్లో గతంలో పనిచేసిన బొడ్డు సాంబశివరావు, కుమ్మసాని లావణ్య, తాడిశెట్టి తిరుపతియ్యలను గుర్తించాడన్నారు. అలాగే మణికంఠ అనే మరో వ్యక్తి తప్పించుకున్నాడన్నారు. హోటల్ గదులను తనిఖీ చేసి చూడగా, డోర్స్ పగలగొట్టి 15 టీవీలు, 4 ఏసీలను దొంగిలించినట్లు గుర్తించి ఫిర్యాదు చేసారన్నారు.

అరండల్ పేట ఎస్ఐ. కె.రోజాలత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ పర్యవేక్షణ లో సీఐ ఆరోగ్యరాజు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి ఏసీలు, టీవీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడైన మణికంఠ పరారీలో ఉన్నాడన్నారు. కేసు దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు, ఎస్.ఐ. కె.రోజాలత, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవులు, కానిస్టేబుల్స్ ఉదయ చంద్, డేవిడ్, నరసింహరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఐఐటీలో ర్యాంక్ రాలేదని విద్యార్థి అదృశ్యం

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శారద కాలనీ 15వ లైను కి చెందిన నల్లపు అభినయ్ ఇంటర్ వరకు చదువుకొని ఐఐటీ పరీక్షలు రాశాడు. అందులో ర్యాంకు రాలేదనే కారణంతో 28వ తేదీన రాత్రి 8 గంటల సమయములో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయలుదేరి వెళ్ళిపోయాడు. చుట్టుప్రక్కల వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. అతని తండ్రి ఇమ్మానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట సీఐకు 8688831332లో తెలియజేయాలన్నారు.

బదిలీల పదోన్నతుల్లో సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ విజ్ఞప్తి చేశారు. శనివారం డీఈవో సీవీ రేణుకకు వినతిపత్రం అందజేశారు. వెబ్ ఆప్షన్స్ కౌన్సెలింగ్‌కి ముందుగానే ఫైనల్ ఖాళీల జాబితా విడుదల చేయాలని కోరారు. ఖాళీలను మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో భర్తీ చేయాలన్నారు.

బదిలీల ప్రక్రియ చేపట్టాలి

గుంటూరు సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖకు ఉరిగా మారిన జీవో 143ను రద్దు చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఏపీ తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి డిమాండ్ చేశారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 143 జీవో ఆధారంగా సీనియర్ ఏఎన్ఎంలను రీ-డిప్లాయ్‌మెంట్ చేశారని అన్నారు. ఆ రీ-డిప్లాయ్ మెంట్ రద్దు చేయకుండా బదిలీల ప్రక్రియ చేపట్టటం దారుణమని అన్నారు.

కార్మిక సంయుక్త కమిషనర్‌గా బాలు నాయక్

గుంటూరు(తూర్పు), మే 31 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జోన్ కార్మిక సంయుక్త కమిషనర్‌గా ఎం.బాలు నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీనివాస్ కుమార్‌కు సత్కారం

కార్మిక శాఖ గుంటూరు జోన్ సంయుక్త కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ పదవి విరమణ సత్కార సభ శనివారం అరండల్ పేటలోని ఓ హోటల్‌లో జరిగింది. సత్కారం సభలో ఉప కార్మిక కమిషనర్ గాయత్రి దేవి, జోన్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు పాల్గొని శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ తదితరులు

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమే : మేయర్

గుంటూరు కార్పొరేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమేనని ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడాప్రాంగణం, స్విమ్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమ్మర్ క్యాంపు 2025 ముగింపు వేడుకలకు కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవితో నగర మేయర్ పాల్గొని క్యాంపులో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసా పత్రాలు మెడల్స్ అందించారు.

మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, రానున్న కాలంలో ఎక్కువమంది చిన్నారులు క్రీడల్లో పాల్గొనేలా స్టేడియంను అభివృద్ధి చేస్తామని, బీఆర్ స్టేడియాన్ని ఆధునిక హంగులతో నిర్మించడానికి కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ కృషి చేస్తున్నారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ స్టేడియంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరిన్ని మౌలిక వసతులు కల్పించి పిల్లల ఆటల కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియం క్రీడల కేంద్రంగా నిలిచేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు నరేంద్ర, జనసేన నాయకులు ఆళ్ళ హరి, స్టేడియం కోచ్ లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

నిమ్మల శేషయ్య వైద్య సేవలు స్ఫూర్తిదాయకం



డాక్టర్ నిమ్మల శేషయ్యను సత్కరిస్తున్న సేవా సదన్, భారతీ సంగీత సాంస్కృతిక కళావేదిక సభ్యులు

గుంటూరు (తూర్పు), మే 31(ఆంధ్ర జ్యోతి): పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్న డాక్టర్ నిమ్మల శేషయ్య సేవలు స్ఫూర్తిదాయకమని సేవా సదన్, భారతీ సంగీత సాంస్కృతిక కళావేదిక అధ్యక్షులు మిరియాల గోపికుమార్, మిరియాల ప్రసాదరావు తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డు, అన్నదాన సమాజ కేంద్రంలో ఎన్టీఆర్ సినిమాల సంగీత విభావరి, ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కార కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య, సామాజిక రంగాల్లో నిమ్మల శేషయ్య చేస్తున్న సేవలు విశేషమైందన్నారు. అనంతరం నిర్వాహకులు ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ నిమ్మల శేషయ్యకు అందజేశారు. కార్యక్రమంలో బిల్లా అశోక్, కే.బాబురావు, అబ్దుల్ ఖాదర్, ఇస్మాయిల్, వెంకటస్వామి, శ్రీనివాసరావు, రాజశేకర్, గాయకులు హేమమాలిని, మల్లేశ్వరి, రమేష్, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎన్- 9 రోడ్డులో చదును చేస్తున్న రోలర్

రాజధానిలో రహదారుల
పనులు ముమ్మరం

- తొలి దశలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ
- శరవేగంగా అరడజనుకు పైగా రోడ్ల నిర్మాణం
- తుది దశకు వెస్ట్ బైపాస్ పెండింగ్ వర్కులు
- త్వరలో మరిన్ని రోడ్ల పనులు ప్రారంభం
- అకాల వర్షాలతో అనుకోని ఆటంకాలు
- నీరు తోడుకుంటూ పనులను సాగిస్తున్న పరిస్థితి

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రహదారుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుత సచివాలయం మొదలు హైకోర్టు, న్యాయమూర్తుల నివాసాలు, మంత్రుల ఆవాసాలు, ఐకానిక్ భవన సముదాయాలను కలిపే రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ లాంఛనంగా పనులు ప్రారంభించడానికి ముందే మౌలిక సదుపాయాలు కల్పించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆ తరువాత పనుల్లో వేగం పెంచాయి.

● వేగంగా ఎన్ సిరీస్ రోడ్ల పనులు

రాజధానిలో అత్యంత కీలకమైన ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, శాశ్వత హైకోర్టు, సచివాలయ భవన సముదాయాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను కలిపే ఎన్ 11, ఎన్ 10 రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. ఎన్ 11 రోడ్డులో గతంలో ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రెయిన్ల నిర్మాణ పనులను పది హేను రోజులుగా కొనసాగిస్తున్నారు. దాంతోపాటు ముఖ్యమంత్రి నివాసానికి అత్యంత సమీపంలో ఉండే ఎన్ 10 రోడ్డులో కూడా పనులు మొదలయ్యాయి. ఎన్ 12, 9 రోడ్లలో కూడా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. కృష్ణయ్యపాలెం, ఎర్రబాలెం సమీపంలో ఎన్ 3 రోడ్డు పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ప్రస్తుత సచివాలయం వెనుక భాగం నుంచి వెళ్లే ఎన్ 9 రోడ్డు మల్కాపురం క్రాస్‌రోడ్డు దగ్గర ఈ 4 రోడ్డును కలుస్తుంది. అక్కడ కూడా ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 3 లేన్లను మరింత విస్తరిస్తున్నారు.

ఈ-సిరీస్ రోడ్ల పనులు పరుగులు

రాజధాని నిర్మాణంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే ఈ సిరీస్ రోడ్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు (ఈ- 3) రోడ్డును కూడా మరింత విస్తరిస్తున్నారు. తుళ్లూరు వద్ద చర్చి నిర్మాణాన్ని పక్కకు జరిపి అక్కడ కూడా పనులు పూర్తి చేశారు. ఈ -4, ఈ-5 రోడ్లతో పాటు సీఎం చంద్రబాబు ఇంటి ముందు నుంచి వెళ్లే ఈ-6 రోడ్డు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్లతోపాటు రాజధానిని అనుసంధానించే వెస్ట్ బైపాస్ రోడ్డు పనులు కూడా తుది దశకు చేరాయి. ఇప్పటికే కృష్ణా నదిపై నిర్మిస్తున్న వారధి నిర్మాణం పూర్తికాగా, అరకొరగా ఉన్న మిగిలిన పనులు కూడా చివరి దశకు చేరాయి. దీంతో ఆ రోడ్డు కూడా త్వరలో అందుబాటులోకి రానుంది.

● అకాల వర్షాలతో ఆటంకాలు..

మే నెల మొత్తం వర్షాలతోనే గడిచిపోయింది. గడిచిన రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలు రోడ్ల నిర్మాణ పనులకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. రోడ్ల నిర్మాణంలో భాగంగా మొదలు పెట్టిన అండగర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వానల కారణంగా మందగించాయి. డ్రెయినేజీ కోసం తీసిన గుంతల్లో నీరు నిండిపోవడంతో పనులు ఆగిపోతున్నాయి. ఏ రోజుకారోజు నీటిని తోడుతున్నా తిరిగి గుంతల్లో నీరు చేరుతుండడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.


ఎన్- 9, ఈ -4 జంక్షన్లో అదనపు వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులు


అడ్డిస్ అబాబాలో పర్యటిస్తున్న అఖిలపక్ష బృందం సభ్యులు సుప్రియా సూలే, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

'సిందూర్' ఆవశ్యకతను వివరించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను వివరించేందుకు భారత అఖిలపక్ష బృందం ప్రపంచ దేశాల పర్యటనలో ఉంది. దీనిలో భాగంగా ఇథియోపియా దేశ రాజధాని అడ్డిస్ అబాబాలో సుప్రియా సూలే నేతృత్వంలో అఖిలపక్షం బృందం శనివారం పర్యటించింది. ఇథియోపియా మాజీ ప్రధాని హైలేమరియం డెస్సాలెగ్న్‌తో బృందం భేటీ అయ్యింది. ఈ బృందంలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజీవ్ ప్రతాప్ రూడీ, మనీస్ తివారీ, అనురాగ్ సింగ్ ఠాకూర్, విక్రమ్‌జీత్ సింగ్, ఆనంద్‌శర్మ, వి.మురళీధరన్, ఐక్యరాజ్య సమితికి భారత దేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ ఉన్నారు.

పోలికలే.. పసి ప్రాయానికి ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

గుంటూరులోని పట్టాభిపురానికి చెందిన ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 560 మార్కులు సాధించింది. తమ పిల్లలకు ఈ మార్కులు వస్తే ఏ తల్లిదండ్రులైనా ఎగిరి గంతేస్తారు. కానీ, విద్యార్థినిని తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించాడు. దీంతో ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది.

గురువుతున్నారు. దీంతో ముఖ్యమైన కౌమార దశ తీవ్ర ఒత్తిడిలో నలిగిపోతోంది.

స్పష్టత లేని లక్ష్యం..

సమాజంలో నిలిచే ప్రతి విజయం తమ ఇంట్లోనే జరగాలనే భావన కొత్తగా ప్రతి ఒక్కరిలో మొదలైంది. ఇది ఒక్క క్రీడల్లోనే కాదు.. అన్ని విషయాల్లోనూ ఇలానే జరుగుతోంది. ఒక విద్యార్థి ఐఐటీలో ర్యాంకు సాధించినా, రూ.లక్షల వేతనంతో ఉద్యోగం పొందినా.. ఆఖరికి యూట్యూబ్ వీడియోలతో ఫేమస్ అయినా.. మీరు కూడా అలా చేయండి అంటూ పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారు. అంతేగాక తాము జీవితంలో కోల్పోయింది.. తమ పిల్లలు సాధించాలని అనుకుంటూ ఉంటారు. కాకపోతే ఏ రంగంలో రాణించాలో సరైన నిర్దేశం చేయలేకపోతున్నారు. ఏదో ఒకటి సాధించాలని చెబుతున్నారే కానీ, అది ఏంటి అనేది స్పష్టంగా పిల్లలకు చెప్పలేకపోతున్నారు.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

పిల్లలు సాధించిన విజయాల్లో తల్లిదండ్రుల పాత్రే కీలకం. చాలా మంది తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. విజేతల కథలను స్ఫూర్తి పొంది.. తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని పిల్లలకు చెప్పాలి. కానీ, వారి ఆసక్తిని గమనించకుండా ఆయా రంగాల్లోకి వెళ్లి విజయాలు సాధించమంటే ఎంతవరకు సాధ్యమవుతుందో ఆలోచన చేయాల్సిన అవసరం చాలా ఉంది.

చులకన చేయొద్దు..

పరీక్షల ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినా.. ఆ ఒక్క శాతం ఎందుకు వదిలేశావని పిల్లలను ప్రశ్నించే తల్లిదండ్రులు సమాజంలో చాలామందే ఉన్నారు. అంతటితో ఆగక.. ఖర్చుల లెక్క బయటకు తీస్తారు. ఇంకెవరినో ఉదాహరణగా చూపుతూ చులకన చేస్తారు. దీనినే విశ్వామిత్ర పెంపకం అంటారు. ప్రస్తుతం 50 శాతం పైన తల్లిదండ్రులు ఇదే పెంపకాన్ని అనుసరిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

కౌమర దశ కీలకం...మానసిక వ్యాధి ప్రమాదం

కౌమర దశ చేరుకునే పిల్లల్లో అనేక సందేహలు తలెత్తుతుంటాయి. వాటి నివృత్తికి తల్లిదండ్రులే చొరవ చూపాలి. అనుమానాలను, వారిలో ఉండే మానసిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఒత్తిడి తట్టుకోలేక ఈ మధ్య యువత సెబ్లింగ్ రైవలరీ అనే మానసిక వ్యాధి భారిన పడుతున్నారు. ఈ వ్యాధి భారిన పడినవారు.. ఒక దశలో తల్లిదండ్రులు చెప్పినవన్ని సాధించినట్లు వారిలో వారే మాట్లాడుకుంటూ ఉంటారు. గొప్పవాళ్లం అయ్యామని అనుకుని చేతులు ఊపడం, ఆటో గ్రాఫ్‌లు ఇవ్వడం వంటివి చేస్తుంటారు. ఈ వ్యాధిని తొలిదశలో గుర్తించలేకపోతే కొంత కాలం తర్వాత పిచ్చివాళ్లగా మారే ప్రమాదముంటుందని మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో దాదాపు 220 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు ఎక్కువగా వీక్షించడం. ఒంటరితనం, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పోలికలతోనే ప్రమాదం

పిల్లలను నేరుగా తిడితే వారికి భరించే శక్తి ఉంటుంది. కానీ, ఇతరులతో పోల్చుతూ మాట్లాడితే మాత్రం తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఆ సమయంలో వారికి ఆత్మహత్య చేసుకోవాలనేంత బాధగా ఉంటుంది. 'మీ పిల్లవాడు వృద్ధిలోకి రాలేక పోతున్నాడు.' అన్న బంధువులు మాటలకు వారికి సమాధానం చెప్పలేక.. ఇంటికి వచ్చి పిల్లలనే తిట్టే తల్లిదండ్రులే ప్రస్తుతం ఎక్కువ. స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటారుగాని.. వాటి అమల్లో మాత్రం మధ్య తరగతి మనస్తత్వం తల్లిదండ్రులకు అడ్డుగా మారుతుంది. చివరికి దుస్తుల విషయంలో కూడా ఎదురింటి వారిని, పక్కింటి వారిని అనుసరిస్తూంటారు. చదువులో కూడా ఎదురింటి పిల్లలు ఎక్కడ చదివితే అక్కడే చదివిస్తుంటారు.

పిల్లల పెంపకంలో పెరిగిన వ్యత్యాసాలు

పిల్లల పెంపకంలో 2005 నాటికి, అంతకు ముందు తల్లిదండ్రులకు ఎంతో వ్యత్యాసం ఉందని మానసిక నిపుణులు చెబుతున్నారు. వృత్తి, ఉద్యోగంలో మరింత ఉన్నతంగా రాణించేలా నాటితరం తల్లిదండ్రుల పెంపకం ఉండేదని, ప్రస్తుతం భిన్నంగా ఉందని అంటున్నారు. 2005 తర్వాత పుట్టిన పిల్లలకు కౌమారం వచ్చే నాటికి నిర్దిష్టమైన లక్ష్యాలు లేవు. పూర్తి యాంత్రిక జీవితంలో తల్లిదండ్రులు ఉండటం వల్ల.. ప్రస్తుత ప్రపంచంలో ఎక్కడ వెనుకబడిపోతారో అనే ఆందోళనతో ఒకటి కంటే ఎక్కువ లక్ష్యాలను వారి ముందు ఉంచుతున్నారు.

దీర్ఘకాలిక శిక్షణతోనే విజయాలు : జీవీఎస్ ప్రసాదు, అథ్లెటిక్ కోచ్, గుంటూరు



ఏ రంగంలోనైనా.. దీర్ఘకాలిక శిక్షణ, కఠోర శ్రమతోనే పిల్లలు రాణిస్తారనే అనే విష యాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. ముఖ్యంగా పిల్లల ఆసక్తిని గమనించాలి. పతకాల మాట అటుంచితే ప్రతి ఒక్కరూ ఆటలపై శ్రద్ధ చూపాలి. మంచి క్రీడాకారులు శారీరక దృఢత్వంతో పాటు మంచి పౌరులుగా రాణిస్తారు.


పిల్లల ఆసక్తిని గమనించాలి : డాక్టర్ వి.వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణులు, జీజీహెచ్



స్మార్ట్ ఫోన్, చౌక ధరలో ఇంటర్నెట్ వచ్చిన తర్వాత రాత్రికి రాత్రే చాలామంది ఫేమస్ అవుతున్నారు. వీటిలో ఎక్కువ శాతం తాత్కాలికమే. దీనిని గుర్తించలేక చాలమంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. 8 ఏళ్ల దాటిన తర్వాత పిల్లల ఆసక్తిని గమనించడం కష్టమేమికాదు. దానిని గుర్తించి చదువుతోపాటు,ఆ రంగంలో శిక్షణ ఇప్పించాలి.

వ్యవసాయశాఖలో.. బదిలీలలు

- మాజీ మంత్రి దగ్గర బంధువుకు ఐదు సిఫార్సు లేఖలు
- కీలక స్థానాలన్నీ వైసీపీ అధికార గణానికే
- చక్రం తిప్పుతున్న కమిషనరేట్ అధికారులు



గుంటూరు సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు జిల్లాకు చెందిన నేతకు కీలకమైన మంత్రి పదవి దక్కింది. నెల్లూరు వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తన బంధువులను ఆగమేఘాల మీద గుంటూరుకు తెచ్చేందుకు ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఏఓ (వ్యవ సాయ అధికారులు)లను తిరుపతి సరిహద్దుల్లోకి తీసుకెళ్లి పడేశారు. అప్పటి నుంచి సదరు అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరలో బాగా ఆదాయం వచ్చే పోస్టు ల్లో పనిచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. వాస్తవానికి అప్పట్లో అంత దౌర్జన్యంగా పోస్టుల్లోకి వచ్చిన వారు వేరే ప్రాంతాలకు వెళ్లాలి. కానీ, విచిత్రంగా అదే అధికారులను కోరుకున్న చోట నియమించమంటూ సిఫార్సు లేఖలు ఇబ్బదిముబ్బడిగా వచ్చాయి. వారిలో ఒక అధికారి ఏకంగా ఐదు సిఫార్సు లేఖలను తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

జోన్-3లో భ్రష్టు పట్టిన బదిలీ ప్రక్రియ

జోన్-3లోని మండల వ్యవసాయ అధికారుల బదిలీ ప్రక్రియ పూర్తిగా భ్రష్టు పట్టింది. కమిషనరేట్ లోని ఇద్దరు కీలక అధికారులు మొత్తం బదిలీలను కలుషితం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని కీలకమైన స్థానాల్లో వైసీపీ నేతల బంధువులకు, ముఖ్య అనుచర గణానికే దక్కేలా చేశారన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది.

చెల్లని టీడీపీ ఎమ్మెల్యేల లేఖలు..

వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యవసాయ అధికారులను కీలకమైన పోస్టుల్లో కూర్చో బెట్టేందుకు ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలను అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న అధికారుల విషయంలో మాత్రం ఈ సిఫార్సు లేఖలను బుట్టదాఖలు చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలను ఒక అధికారి కంటితో చూసేందుకు కూడా ఇష్టపడలేదని చెబుతున్నారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫలానా మహిళా అధికారి తమకు అవసరం లేదని చెప్పి నా.. ఆమెను అక్కడే ఉంచే విధంగా జాబితా తయారు చేశారు. పల్నాడు జిల్లాలోని ఒక నియోజక వర్గంలో పనిచేస్తున్న ఏఓ గత నాలుగు సంవత్సరాల నుండి అక్కడ పనిచేస్తూ.. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కోసం ఎన్నికల్లో తీవ్రంగా పనిచేశారు. ఆ పోస్టు కోసం టీడీపీకి మద్దతుగా ఉన్న బీసీ వర్గానికి చెందిన ఏఓ దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు అక్కడ పోస్టింగ్ ఇవ్వాలని ముఖ్య నేతలు సిఫార్సు చేసినా.. వైసీపీ నేత కోసం రాత్రింబవళ్లు కష్టపడిన ఏఓకే కమిషనరేట్‌లోని అధికారులు లైన్ క్లియర్ చేశారు. చేసేది లేక బీసీ వర్గానికి చెందిన ఏఓ నరసరావుపేటకు మారినట్లు తెలుస్తోంది.

జిల్లా కేంద్రంలో కీలక స్థానాల్లో...

గుంటూరు జిల్లా కేంద్రంలో చాలా ఏఓ పోస్టులు వివిధ విభాగాల్లో ఉన్నాయి. వాటన్నిటిల్లో గడచిన ఆరేళ్లుగా వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వాళ్లే ఉన్నారు. ప్రస్తుత బదిలీల్లో వాళ్లకు స్థాన చలనం ఉంటుందని అందరూ భావించారు. కానీ ఒక్కరిని కూడా ఆయా పోస్టుల నుంచి కదిలించలేదు. అసోసియేషన్ పేరుతో అదే పోస్టుల్లో కొనసాగేందుకు ప్రణాళిక రచించారు. పెదనందిపాడు మండలం కీలకంగా వ్యవహరించే కొందరు వైసీపీ నేతల బంధువు గత ప్రభుత్వం నుంచి జిల్లా కేంద్రంలో కీలక స్థానం లో కొనసాగుతున్నారు. ఆయనపై డీలర్లు కూడా పలు ఆరోపణలు చేస్తున్నా.. సదరు ఏఓ కోసం గతంలో ఇక్కడ పనిచేసి పీకల్లోతు అవినీతిలో కూరుకు పోయిన ఒక మహిళా అధికారి కమిషనరేట్లో చక్రం తిప్పినట్లు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అసోసియేషన్ పేరు తో అనేక మంది పాత స్థానంలోనే పాతుకు పోయినట్లు చెబుతున్నారు.

ఏడేళ్లు దాటినా అక్కడే

ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన బదిలీల జీఓ ప్రకారం ఒకే స్టేషన్ లో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలి. గుర్తింపు ఉన్న ఉద్యోగుల యూనియన్‌లలో ఉన్నవారికి మాత్రం మినహాయింపు ఉంటుంది. వ్యవసాయ అధికారుల బదిలీలలో ఈ నిబంధనను దుర్వినియో గం చేసినట్లు తెలుస్తోంది. కొందరు వ్యవసాయ అధికారులు ఒకే స్టేషన్‌లో ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నా రు. బదిలీల దగ్గరికి వచ్చేటప్పటికి వారి సర్వీస్‌ను ఐదేళ్లు మాత్రమే చూపించారు. ఏకంగా రెండేళ్ల సర్వీస్‌ను ఎగరగొట్టేశారు. ఉద్దేశ్య పూర్వకంగానే జాబితాలో ఇటువంటి పొరపాట్లకు చోటు కల్పించినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ఏడేళ్లు దాటినా అదే స్థానంలో ఉండెందుకు అసోసియేషన్ పాయిం ట్‌ను వినియోగించారు. అసలు గుర్తింపు లేని కొన్ని అసోసియేషన్ లను ఎలా పరిగణలోకి తీసుకున్నారన్నది ప్రశ్నర్థకంగా మారింది.

పెద్దల పేర్లు చెప్పి వసూళ్లు

వ్యవసాయ శాఖలో జరుగుతున్న బదిలీల పర్వంలో భారీ అవినీతి జరిగినట్లు చెబుతున్నారు. కొంతమంది పెద్దల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానిపై కొందరు ముఖ్యులు ఆరా తీసి కొందరిపై నిఘా వేసినట్లు చెబుతున్నారు.



కౌంటర్‌లో నిరీక్షిస్తున్న వినియోగదారులు

పార్శిల్‌కు తప్పని నిరీక్షణ

● ఆర్టీసీ కార్గోలో వినియోగదారుల బారులు ● కౌంటర్లు పెంచాలని విజ్ఞప్తి

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సరుకు రవాణా సంస్థ కార్గో పార్శిల్ డిపాజిట్‌లకు వెళితే వినియోగదారులు గంటల తరబడి పడిగాపులు పడాల్సి పరిస్థితులు ఏర్పడ్డాయి. వస్తువులు పార్శిల్‌కు ఇవ్వాలంటే క్యూలో నిల్చున్న వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థలో వివిధ రకాల వస్తువులు నిత్యం పెద్ద ఎత్తున ఎగుమతి, దిగుమతులు అవుతుంటాయి. గతంలో ఆర్టీసీకి అనుబంధంగా ప్రైవేటు సంస్థ ఏఎస్ఎల్ పార్శిల్ రవాణా వ్యాపారం నిర్వహించింది. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణా ళికలు రూపొందించింది. వస్తు రవాణా గ్యారంటీ, నమ్మకంతో కూడిన వ్యాపారం కార్గో నిర్వహిస్తోంది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి చార్జీ నిర్ణయిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ

గుంటూరు ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం హై దరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్దఎత్తు న సరుకు రవాణా జరుగుతోంది. గత ఆర్థిక సం వత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్గో నిలిచి నట్లు అధికారులు తెలిపారు. ఇలా రోజురోజుకు ఆర్టీసీ కార్గో పార్శిల్‌సంస్థకు వినియోగదారులు ఆదరణ పెరుగుతోంది.

ఆదరణ స్థాయిలో పెరగని కౌంటర్లు

వినియోగదారుల తాకిడికి అనుగుణంగా అధికా రులు మాత్రం ఆ స్థాయిలో కౌంటర్లు పెంచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో సంస్థకు పెద్ద ఎత్తున వినియోగదారులు చేరుకున్నారు. ఈ క్రమం లో రద్దీగా ఉండటంతో ఒక్కొక్కరు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. దాంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. రద్దీ సమయాల్లోనైనా మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వినియోగదారులు కోరినప్పటికీ కార్గో అధికారులు పెడ చెవిన పెడుతు న్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారు లు స్పందించి రద్దీ సమయాల్లోనైనా అదనపు కౌం టర్లు ఏర్పాటు చేసి, వినియోగదారుల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

తాడేపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు శనివారం వీల్ చైర్స్ పంపిణీ చేశారు. బోసుబొమ్మ సెంటర్లో ఒకరికి, ప్రకాష్‌నగర్, శర్వరాజు ప్రాంతంలో ఇద్దరేసి వంతున మొత్తం ఐదుగురికి వీల్ ఛైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డి, జొన్నా రాజేష్, నాగరాజేష్, కిషోర్, టీడీపీ నేతలు ఇట్టా బాస్కర్, నూరగాని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మంగళగిరి సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ గీతా యోగా ఆరోగ్య సేవాకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని ప్రధాన యోగాచార్యులు పంచుమర్తి సత్యనారాయణ తెలిపారు. తెనాలి రోడ్డులోని మార్కండేయ పద్మశాలి కళ్యాణ మండపం మెయిడ్ అంతస్తులో 15 రోజులపాటు జరిగే ఈ శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇస్తామన్నారు. మంగళగిరి ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

యువకుడి మృతి

మంగళగిరి సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఓ బార్‌లో జరిగిన విధ్వంసం ఘటనలో యువకుడు మృతి చెందాడు. మంగళగిరి పట్టణ సీఐ డీ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చినకాకాని గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు మంగళగిరి ఆటోనగర్ వద్ద గల కశా బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫూటుగా మద్యం తాగారు. తర్వాత వారిలో వారే గొడవ పడుతూ పక్కవారితో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో చినకాకాని గ్రామానికి చెందిన పుట్లగూర రవిచంద్ర (25) చేతితో అద్దాన్ని పగలగొట్టాడు. అద్దం కోసుకుని చేతికి విపరీతమైన రక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే రవిచంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఈ ఘటనపై బార్ యాజమాన్యం నుంచి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పేరేచర్లలో బైక్ చోరీ

మేడికొండూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్ల జంక్షన్లో తన ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అపహరించుకుపోయారని తాతా అచ్చయ్య శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న తాత అచ్చయ్య తన హీరో హోండా గ్లామర్ మోటార్ బైక్‌ను తాను నివసిస్తున్న ఇంటి ముందు పార్క్ చేసి కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. సాయంత్రం వరకు సమీప ప్రాంతంలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయా ప్రాంతంలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో పేరేచర్ల ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను అపహరించుకుపోతున్నారు. దీంతో మోటార్ సైకిళ్లను ఇంటి లోపల భద్రపరుచుకోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

కార్పొరేట్లను మెప్పించేందుకే లేబర్ కోడ్‌లు: సీఐటీయూ

మంగళగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులను మెప్పించేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో సీఐటీయూ పతాకాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి టీ బాబు ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావం నుంచి కార్మిక వర్గం సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందని చెప్పారు. కార్మికులు ఎన్నో పోరాటాలు ఫలితంగా సాధించుకున్న హక్కులను పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు అన్ని హక్కులను కోల్పోతారని, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాపితంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు టీ ఆది లక్ష్మి, కే కోటేశ్వరి, ఎం పార్వతి, దివ్య, నాగేశ్వరరావు, టీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి సెంటర్లో సినీనటుడు కృష్ణ జయంతి వేడుకలు

తాడేపల్లి (ఉండవల్లి), మే 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమాకి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన నటశేఖరుడు సినీనటుడు కృష్ణ జయంతిని శనివారం ఉండవల్లి సెంటర్‌లో నిర్వహించారు. లింగారెడ్డి అసోసియేట్స్, బాలాజీ స్వీట్స్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్, స్వీట్లు మూటా కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు శిరిశెట్టి రాజా రమేష్, దాసరి కృష్ణ, మహాకాళి పండు, శిరిశెట్టి శ్రీనివాసరావు, గోపాలం కొండలరావు, సందు అప్పారావు, కొడె సుబ్బారావు, బసిరెడ్డి దుర్గారావు, వెంకటేష్, మిత్రబృందం పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

తుళ్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జూన్ రెండో తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను శనివారం బోరుపాలెంలో నేతలు ఆవిష్కరించారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

వట్టిచెరుకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామాల్లో శనివారం ఉదయమే వివిధ రకాల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో సెక్రటరీలు, అధికారులు పంపిణీ చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబు పలు గ్రామాల్లో పర్యటించి పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు.

వర్షంలో తడిసి.. నలుపు రంగుకు మారిన మొక్కజొన్న

● కోసిన పంటను రోడ్లపై ఆరబెట్టిన రైతులు
● పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం
● ధరలో కోత విధిస్తున్న దళారీలు
● ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు


తడిసి రంగుమారి పోయిన మొక్కజొన్న కండెలు

దుగ్గిరాల, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట తడిసి నలుపు రంగుకు మారిపోయి రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న కోసిన రైతులు వర్ష భయంతో రోడ్లపై పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఆరబెట్టుకునేందుకు ట్రాక్టర్లతో రోడ్లపైకి చేర్చిన రైతులు, వర్షం వెంటాడుతుండటంతో పూర్తిస్థాయిలో గింజ ఎండలేదు. వర్షపు నీరు పట్టాల నుంచి లోపలికి ఇంకిపోవడం, గాలివడక పోవడంతో పాటు, పట్టాల అడుగు నుంచి కండెల కిందకు నీరు చేరడంతోనూ 20 శాతానికి పైగా పంట దెబ్బతిని రంగుమారిపోయింది. రంగుమారిన కండెలను గ్రేడింగ్ చేయడానికి అదనపు ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగుమారిందనే మిషతో ధరలో భారీగా కోత

వర్షాలకు తడిసి రంగుమారిందన్న మిషతో దళారులు ధరలో భారీ కోత విధిస్తున్నారని, మొక్కజొన్న రైతులు వాపోతున్నారు. పంట దిగుబడి ఎలా ఉన్నప్పటికీ, ఎకరాకు 10క్వింటాళ్ల వరకూ నష్టపోక తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగుమారిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరకు వీలైనంత త్వరగా కొనుగోలు చేసి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.


హడావిడిగా కండెలను ట్రాక్టర్లకు లోడు చేస్తున్న రైతులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం దాదాపు పూర్తైందని, దీనికి సహకరించిన ఉద్యోగులు, కూటమి కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి లీల మల్లేశ్వరరావు, రామారావు, నారాయణ, ఉపేంద్ర, నాగరాజు, ఆజాద్, డీ శ్రీను మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న బూర్ల రామాంజనేయులు

పేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

మేడికొండూరు మే 31 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి చదువుకునే పేద విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ అన్నారు. గ్రామానికి చెందిన దొరడ్ల జగదీష్ సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుకుని 559 మార్కులతో పాఠశాలలో ప్రథమంగా నిలిచాడు. ఉన్నత చదువుకు వెళ్లడానికి కుటుంబ ఆర్థిక స్థితి అనుకూలించకపోవడంతో జగదీష్ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతోంది. విద్యార్థి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ ఈ విషయాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీవాల్‌కి తెలియజేశారు. శ్రీవాల్ వెంటనే స్పందించి విద్యార్థికి ఇంటర్ చదువుకు అవసరమైన ఆర్థిక సాయంగా లక్షా 20వేల రూపాయల చెక్కును ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్‌తో విద్యార్థికి శనివారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు స్ఫూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీవాల్, శిరీష, ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్ తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్

పొగాకు వాడకం ప్రపంచ ఆరోగ్యానికి ముప్పు


పొగాకు వినియోగంపై ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది

తాడికొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం వల్ల ప్రపంచ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సీఏఎస్ డాక్టర్ నళినిదేవి తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా తాడికొండ ఆరోహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గ్రామంలో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ నళినిదేవి మాట్లాడుతూ పొగతాగేవారికే కాకుండా పొగ పీల్చేవారికి ఎంతో హానికరం అని తెలిపారు. పొగాకు వాడకం వలన నేటి క్యాన్సర్లు వస్తున్నాయని అన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శివగోపాల్, రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరువలో తీసుకున్న ప్రమాదమే

దుగ్గిరాల, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను ఏరువలో తీసుకున్నప్పటికీ క్యాన్సర్ వంటి జబ్బును కొని తెచ్చు కున్నట్లేనని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి, గ్రామవీధుల్లో పొగాకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఇందిర మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులతో ప్రపంచ వ్యాప్తంగా 80లక్షల మంది వరకూ క్యాన్సర్‌బారిన పడుతున్నారన్నారు. పొగాకు ఉత్పత్తులు తీసుకునే వారు శ్వాసకు సంబంధించి, గొంతుకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఐంటనే తగిన నర్సే చేస్తున్న ఆశా కార్యకర్తలకు సరియైన చెప్పుకుని తగిన చికిత్స పొందాలన్నారు. పొగాకు వాడకాన్ని నియంత్రించగల్గితే అనేక కుటుంబాలను కాపాడినట్లేనన్నారు.

● పిరంగిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రశాంతమైన జీవితం కావాలి - బీడీకి ఉద్వేగం అనే నినాదంతో డాక్టర్లు కరీనా బేగం, యాని గ్రేసిల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారులు వెంకటలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది, ఆశాలు, పాల్గొన్నారు.

కుటుంబమిషన్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

పెదనందిపాడు, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభకానున్న కుట్టు మిషన్ శిక్షణ తరగతులకు ఆసక్తి కలిగిన మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని శిక్షణ కేంద్ర నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు, శిక్షణను మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, పలువురు పారిశ్రామికవేత్తలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నృసింహాలయ అభివృద్ధికి కృషి చేస్తా

● ఈవో సునీల్‌కుమార్

మంగళగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన కార్యనిర్వహణాధికారి కోనేటి సునీల్‌కుమార్ చెప్పారు.


ఈవో సునీల్‌కుమార్‌ని అభినందనలు తెలియజేస్తున్న రమేష్‌బాబు

నృసింహాలయ ఈవోగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈవోగా పనిచేసిన ఒగ్గునుబోర్డ్ రామకోటిరెడ్డి శనివారంతో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో నూతన ఈవో (ఎఫ్ఏసీ)గా సునీల్‌కుమార్ రామకోటిరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. సునీల్‌కుమార్ ప్రస్తుతం దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు శ్రీమహంకాళి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కొనసాగుతున్నారు. కాగా, మంగళగిరి మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ మన్నెం రమేష్‌బాబు ప్రభృతులు ఈవో సునీల్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నృసింహాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

రేషన్ దుకాణాదారులు నిబంధనలు పాటించాలి

● తహసీల్దార్ వెంకటస్వామి

పెదనందిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణాదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించాలని, 15వ తేదీ వరకు నిర్దేశిత సమయాల్లో తెరచి ఉంచాలని, నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండరాదని, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని తెలిపారు. స్టాక్ నిల్వలను, ధరల పట్టికను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేస్తున్నట్లు గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించాలని, ఆయా కూడళ్లలో బ్యానర్లు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీ శివశంకర్, డీటీ కరిముల్లా, ఇన్‌ఛార్జ్ ఆర్ఐ యేహోషువా తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి విత్తుతు పింఛన్ల పంపిణీ

దుగ్గిరాల, మే 31 (ఆంధ్రజ్యోతి): కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను జూన్ 12న పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 1వతేదీ ఆదివారం కావడంతో పింఛన్ దారులకు శనివారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పింఛన్‌దార్ల ఇండ్లకు వెళ్లి ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభించి, 11గంటల లోపే 90శాతానికి పైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు. మండలంలో ప్రతినెలా మొత్తం 9059 మందికి రూ.3కోట్ల 84లక్షల 13వేల 500 మంజూరు చేస్తున్నామని, ఈ నెల 12వ తేదీన కొత్త పింఛన్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందించనున్నట్లు చెప్పారు.


ఇంటివద్దకే వెళ్లి వృద్ధులకు పింఛను అందిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

శ్రీషిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

పిరంగిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండ్రిక గ్రామంలో గల శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం నాలుగో వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలను చేశారు. రాజన్ ట్రేడర్స్ సోడా పిచ్చయ్య, మల్లేశ్వరి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గజేంద్ర రాధాకృష్ణ జ్ఞాపకార్థం భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం లో జిల్లా టీడీపీ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, చెక్కా హనుమంతరావు, సర్పంచ్ నలజర్ల అప్పయ్య, పీఏసీ మరియన్న, వందవాని సత్యనారాయణ, నల్లజర్ల రవికుమార్, కట్ల పేరయ్య, మండవ కృష్ణయ్య సీఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.


కండ్రిక షిరిడీ సాయి వార్షికోత్సవంలో రాజన్ ట్రేడర్స్ సోడా పిచ్చయ్య దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీ సీజ్

పెదనందిపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - పెదనందిపాడు రహదారి గుండా లారీలో ఇతర ప్రాంతాలకు పశువులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పాలపర్రు నుంచి పెదనందిపాడు వస్తున్న ఏపీ39యూ 3554 నెంబరు గల లారీని ఆపుచేసి దానిలో అనుమతులు లేకుండా 20 ఎద్దు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాలపర్రుకు చెందిన పీ శేఖర్‌కు చెందిన 20 ఎద్దులను పాలపర్రు నుంచి నెల్లూరు జిల్లా నాయుడుపేటకు తరలిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ వెంకటస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తహసీల్దార్ సిఫారసు మేరకు అక్రమంగా పశువులను తరలిస్తున్న శేఖర్‌పై జంతువుల పై క్రూరత్వ నిరోధక చట్టం 1960 కింద కేసు నమోదు చేసి, ద్రాక్ష చేస్తున్నట్లు ఎస్ఐ ఐదుకి మధుపవన్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను సేఫ్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు.

శ్రీఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

పిరంగిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరికపూడి గ్రామంలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. పూజారులు ప్రత్యేక పూజలను చేశారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, దేవదాయశాఖ ఈవో శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ప్రథమ ర్యాంకర్‌కు నగదు ప్రోత్సాహం

దుగ్గిరాల, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తూ పదో తరగతి పరీక్షల్లో మండల ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని ఉమామహేశ్వరి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని దుగ్గిరాల తహసీల్దార్ జి సునీత అన్నారు. పదోతరగతి పరీక్షల్లో మండల ప్రథమ ర్యాంకు సాధించిన గంప ఉమామహేశ్వరిని తహసీల్దార్ అభినందించారు. గివింగ్ బ్యాక్ సొసైటీ స్వచ్ఛందసంస్థ తరఫున తహసీల్దార్ సునీత చేతుల మీదుగా రూ.10వేల నగదు చెక్కును శనివారం అందించి మనోధైర్యం నింపారు. విద్యార్థినికి నగదు ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు.



విద్యార్థిని గంప ఉమామహేశ్వరికి రూ.10వేల నగదు చెక్కును అందిస్తున్న తహసీల్దార్ సునీత

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు..

● పది లక్షలు విరాళం ప్రకటించిన సురక్ష హాస్పిటల్ అధినేత

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు హిందూ శ్మశాన వాటికలో కపాలమోక్ష వేదికకు గుంటూరుకు చెందిన సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రగతిరెడ్డి పది లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఆ సొమ్ముతో శనివారం గ్రామ పెద్దలు వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్తిపాడుకు చెందిన గుజ్జల శ్రీనివాసరెడ్డి ఇటీవల మరణించారు. ఆయన జ్ఞాపకార్థం ఈ నిర్మాణానికి ఆమె ముందుకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఈ వేదిక లేకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్మాణం గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పెద్దలు భావిస్తున్నారు.

సీతానగరంలో విజిబుల్ పోలీసింగ్


సీతానగరం నది తీరంలో పర్యాటకులకు సూచనలిస్తున్న ఎస్ఐ ఖాజావలి

తాడేపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం కృష్ణానది తీరంలో శనివారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో నిర్వహించారు. వారాంతాల్లో నది తీరానికి వచ్చే పర్యాటకులకు ఎస్ఐ ఖాజావలి పలు సూచనలు చేశారు. డ్రోన్ ద్వారా బ్లైండ్ పాయింటు చేసి, పుష్కర ఘాట్లు, గతంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగిన ప్రాంతాలను జల్లెడపట్టారు. అలాగే పెట్రోలింగ్ నిర్వహించి ద్విచక్రవాహనాలను తనిఖీలు చేశారు.

వంగిపురంలో పారిశుధ్యం అధ్వానం

● రోడ్లపై పారుతున్న మురుగు
● చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు



కాలువలు పూడి పోవడంతో సీసీ రోడ్లపై పారుతున్న మురుగునీరు

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో పారిశుధ్యం అధ్వాన స్థితిలో ఉంది. ఈ గ్రామంలో ఎప్పుడు కాలువలు తీశారో ఏమో కానీ మురుగు మొత్తం రోడ్లపైనే పారుతుంది. గత తెలుగుదేశం పార్టీ హయాంలో గ్రామం మొత్తం దాదాపుగా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మురుగు కాలువలు నిర్మించారు. అయితే కాలువల పూడిక తీత సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తుంది. గత వైసీపీ హయాంలో పంచాయతీలకు నిధులు లేక కాలువలు తీసిన పాపాన పోలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు వేస్తుంది. అయితే ఇక్కడ మాత్రం ఆ జాడలు కనిపించడం లేదు. కాలువలు మొత్తం పూడి పోయి సీసీ రోడ్ల పైకి మురుగునీరు ప్రవహిస్తుంది. సీసీ రోడ్ల కిస్త మురుగు కాలువలుగా కనిపిస్తున్నాయి. అంతే కాకుండా కొన్ని ప్రధాన కాలువల్లో విపరీతంగా జమ్ము, పిచ్చి మొక్కలు పెరిగి కనిపిస్తున్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుటే మురుగు రోడ్డెక్కి పరిస్థితి కనిపిస్తుంటే గ్రామంలో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. మండలంలో గ్రామాల్లో పర్యటించి మండల అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాల్సిన ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు తమ కేంపు నుంచి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.




జమ్ము, మొక్కలతో నిండి పూడిపోయిన కాలువ

100 మందికి కంటి వైద్య పరీక్షలు


కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

పెదనందిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉప్పలపాడు సత్యసాయిబాబా సేవా మందిరంలో పార్వతి రాంబాబు సహకారంతో రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వారు శనివారం డాక్టర్ తనీమా, సుప్రియలు 100 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లపనేని శివప్రసాద్, సభ్యులు పోపూరి లక్ష్మీనారాయణ, పోపూరి నాగేశ్వరరావు, యెలిశెట్టి రమణ, రామిరెడ్డి, ఏవో నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షం పడినా చిత్తడే..

● వీధుల్లో నిలుస్తున్న మురుగు నీరు
● అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం
● ఆందోళనలో గ్రామస్థులు


బోరుపాలెంలో ఒక బజారులో ఇళ్ల మధ్యలో నిలబడిన వర్షపు నీరు

తుళ్లూరు(బోరుపాలెం), మే 31 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బోరుపాలెం గ్రామంలో ఏ చిన్నపాటి వర్షం పడినా ఇళ్లల్లో నుంచి కాలు తీసి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. వారం రోజులు నుంచి వర్షాలు పడుతుంటే బజారుల్లో నీరు నిలబడి ఉంటుంది. డ్రైనేజ్ వ్యవస్థ రోడ్డు సరిలేకపోవటంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో వర్షపు నీరు రోజుల తరబడి నిలబడి ఉంటుంది. వర్షాలు పడకపోయినా ఇళ్లల్లో వాడిన నీరు సైడు కాల్వలు లేకపోవటం వల్ల మురుగు నీరు రోడ్లపైనే ఉంటుంది. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సమస్యను ఎంపీడీవో దృష్టి తీసుకెళ్లామని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీలో నిధులు లేవని సీఆర్డీఏ వారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సీఆర్డీఏ అధికారులు వెంటనే స్పందించి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాగా ఇటీవల రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో రైతులకు హామీనిచ్చారు. డీపీఆర్‌లను తయారు చేయాలని గ్రామ, మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 31(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని తూములూరు, కొల్లిపర బొమ్మువానిపాలెం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. సచివాలయాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

చైర్‌పర్సన్ భర్తపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

తెనాలి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ హాల్లోకి అర్హత లేకుండా చైర్‌పర్సన్ భర్త, వైసీపీ నాయకుడు తాడిబోయిన రమేష్ వచ్చి తమపై పరుష పదజాలంతో తిట్టి దౌర్జన్యానికి దిగాడని టీడీపీ 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధంగా జరిగిన ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సాధారణ సమావేశంలో జగనన్న కాలనీలో జరిగిన అవినీతిపై చర్చ జరుగుతున్న క్రమంలో కౌన్సిలర్ కాని వ్యక్తి రమేష్ హాలులోకి దూసుకువచ్చాడన్నారు. పైగా పెద్దపెద్దగా కేకలు పెడుతూ బూతులు తిడుతూ తన భార్య చైర్‌పర్సన్‌గా ఉన్నంతకాలం మీరు కుక్కల్లాగా పడిఉండండి. లేకపోతే అంతు చూస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడని ఆమె తెలిపారు. కౌన్సిల్ హాల్లోకి అనర్హుడుగా ఉన్న వ్యక్తి కౌన్సిల్‌కు రావడమేకాక సభ్యులను బెదిరింపులకు గురిచేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తనకు ఎలాంటి ప్రాణ నష్టం జరిగినా అతడే బాధ్యుడని ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అరుణ కోరారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

పొన్నూరుటౌన్(చేబ్రోలు), మే 31: మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, చౌదరి యూత్ సభ్యుడు సోమవరపు భరత్ చౌదరి(32) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉండే భరత్‌చౌదరి ఆకస్మిక మృతి గ్రామంలో విషాదఛాయలు నింపింది. చేబ్రోలు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు భరత్‌చౌదరి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భరత్ చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

6న చిన్నారులతో గోవింద నామ సంకీర్తన

తెనాలి అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో గోవిందనామ సంకీర్తన యజ్ఞం నిర్వహిస్తున్నామని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 6న వైకుంఠపురంలోని ఆలయంలో 108 మంది చిన్నారులు సంకీర్తనలో పాల్గొంటారని తెలిపారు. సంకీర్తనలో పాల్గొనే బాలబాలికలకు స్వామివారి దర్శనం, ప్రసాదాలు, మెమొంటో పంపిణీ చేస్తామన్నారు. సంకీర్తన యజ్ఞంలో పాల్గొనే బాల బాలికలు బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో పేర్లు నమోదు చేసుకుని సంకీర్తన బుక్‌లెట్ తీసుకుని వెళ్లాలని కోరారు. బాలచంద్ర మౌళి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల కూలీలు సమయపాలన పాటించాలి

కొల్లిపర, మే 31(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల కూలీలు సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని ఏపీవో వెంకయ్య అన్నారు. శనివారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కూలీలకు కొలతలను బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఅంజనేయస్వామి శిఖర ప్రతిష్ఠ మహోత్సవం

కొల్లిపర, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర కరకట్ట సమీపంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం శిఖర ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పండితులు వేదమంత్రాలతో శిఖర ప్రతిష్ఠ చేశారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి ఆలయం ఎదుట అర్చకుల హోమాలతో, వేద మంత్రోచ్చారణతో మార్మోగింది. ప్రధాన అర్చకుడు జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో పండితులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఓంకారాశ్రమంలో ఆలయ ప్రతిష్ఠ

తెనాలి అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని ఓంకారాశ్రమంలో ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సకల దేవత శిఖర ధ్వజస్తంభ, శరభ సాలేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠను పండితులు నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు జరిపారు. తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి, ఒంగోలు సంతు సదానంద ఆశ్రమ మాతాజీ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గ్రూపు ఆలయాల ఈవో హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ శారదా దేవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉచిత వైద్యశిబిరం


చిన్నారికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రిన్స్ మహేష్‌బాబు సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆంధ్రహాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ రామారావు చెప్పారు. శనివారం కృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం, మహేష్‌బాబు దత్తత గ్రామం బుర్రిపాలెంలో విజయవాడ ఆంధ్రహాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 146మంది వివిధ అనారోగ్యసమస్యలతో క్యాంపునకు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించామని రామారావు పేర్కొన్నారు. ఇప్పటివరకూ గ్రామంలో మహేష్‌బాబు సౌజన్యంతో 44 క్యాంపులు నిర్వహించామని ఆరోగ్యకరమైన గ్రామంగా బుర్రిపాలెంను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత గ్రామంలో కృష్ణ కాంస్యవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యులు మదస్సిర్, సాయికిరణ్, అమర్, పవన్, రమేష్, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

చెట్లతో మూసుకుపోయిన రోడ్లు

● ప్రయాణికుల అవస్థలు

● పట్టించుకోని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు

కొల్లిపర, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు చెట్లతో మూసుకుపోతున్నాయి. దీంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లకు ఇరువైపులా ముళ్ళ చెట్లు పెరిగి పొదల మాదిరిగా ఉండటంతో వాహనదారులతో పాటు ఆర్‌టీసీ డ్రైవర్లు కూడా అనేక ఇబ్బందులు గురికావాల్సి వస్తుంది. ఆర్‌టీసీ బస్సులు ఎదురెదురుగా వచ్చినప్పుడు బస్సుల్లో ప్రయాణించే వారికి ముళ్ల చెట్లకొమ్మలు తగలటంతో గాయాలవుతున్నాయి. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినా వారిలో ఎటువంటి చలనం లేదు. ముఖ్యంగా కుంచవరం నుంచి దంతలూరు మీదుగా మున్నంగి వెళ్ళే రోడ్డు, కొల్లిపర-మున్నంగి రోడ్డు, కొల్లిపర నుంచి దావులూరు మీదుగా తెనాలి వెళ్ళే రోడ్డు, అత్తోట నుంచి తేలప్రోలు మీదుగా తెనాలి వెళ్ళే రోడ్డు చెట్లతో మూసుకుపోయాయి. రోడ్లపై వాహనాలు ప్రయాణించాలంటేనే నానా ఇబ్బందులు పడాల్సివస్తుంది. హనుమాన్‌పాలెం నుంచి కొత్తబొమ్మువానిపాలెం సమీపంలో చిన్నకరకట్టపై ఏర్పాటుచేసిన రోడ్డుకు ఇరువైపుల చెట్లు మూసుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ముళ్లచెట్లు గుబురుగా మారటంతో మహిళలు కొత్తబొమ్మువానిపాలెం నుంచి హనుమాన్‌పాలెం వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. ముళ్ల చెట్ల కారణంగా కూలి పనులకు వెళ్ళాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు చెట్లతో మూసుకుపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ముళ్ల చెట్ల గురించి ఇరిగేషన్ అధికారులకు అనేక పర్యాయాలు తెలియజేసినా వారి నుంచి ఎటువంటి స్పందన లేదని హనుమాన్‌పాలెం, కొత్తబొమ్మువానిపాలెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల చెట్లను వెంటనే తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


అత్తోట సమీపంలో చెట్ల కొమ్మలతో మూసుకుపోతున్న రోడ్డు


కొల్లిపర సమీపంలో రోడ్డుపై ఒంగిపోతున్న చెట్లు

యోగాభ్యాసం అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల


యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాభ్యాసాలను అలవరచుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న యోగాంధ్ర, యోగా ఫర్ ఒన్ ఎర్త్, ఒన్ హెల్త్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కొరకు యోగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దైనందిన జీవితంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. యోగాభ్యాసం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, యోగా గురువులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్డుదారులకు రేషన్ సరుకులు సకాలంలో అందించండి

● సబ్‌కలెక్టర్ సంజనసింహా


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనసింహా

తెనాలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందించి ప్రభుత్వానికి ఇటు ప్రజల్లో డీలర్లు మంచి పేరు తెచ్చుకోవాలని సబ్‌కలెక్టర్ సంజనసింహ చెప్పారు. శనివారం పట్టణంలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మనషాపు- మన రేషన్ పేరుతో డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేషన్ షాపుల్లో డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సంజన సింహ మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 2 నుండి డీలర్ల నుండే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్క డీలరు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ తిరిగి సాయంత్రం 4 నుండి రాత్రి 8 వరకూ రేషన్ షాపులను తెరిచి ఉంచాలన్నారు. కార్డుదారులు ఏ క్షణంలో వచ్చినా వారికి సకాలంలో సరుకులు అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పోస్ యంత్రాలు, తూకం వంటివి సక్రమంగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలన్నారు. లబ్ధిదారులకు తాగు నీరు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పంపిణీలో ఏవైనా లోపాలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు తెలపాలని తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు పడుతున్నామన్న ఫిర్యాదు రాకుండా మంచిగా మసలుకోవాల్సిన బాధ్యత డీలర్లపైనే ఉందన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సిద్ధార్థ, మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, లీగల్ మెట్రాలజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై చర్యలు శాంతిభద్రతల పరిరక్షణకే..


మాట్లాడుతున్న రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

తెనాలి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై పోలీసులు తీసుకున్న చర్యలు శాంతిభద్రతల పరిరక్షణలో భాగమేనని దీనిపై కొన్ని కులసంఘాలు విమర్శించడం.. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరడం సమంజసం కాదని రాష్ట్రయాదవ సంఘం అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. శనివారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నో కేసుల్లో నిందితులుగా ఉండటం, గంజాయికి అలవాటుపడటం, ఐతానగర్‌లో ప్రజలను బెదిరించడం వంటి పలు కేసుల వలనే వారిని అదుపులోకి తీసుకుని శిక్షించారన్నారు. రౌడీషీటర్లు దాడిచేసిన కానిస్టేబుల్ బీసీ అని, ఆయన భార్య ఎస్సీ అని, వారికి న్యాయంచేసేలా మాట్లాడకుండా నిందితులను వెనకేసుకుని రావడం సరికాదన్నారు. సీఐలను బదిలీచేయాలని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సంఘాలు పిలుపునివ్వడం సరికాదన్నారు. వారిపై చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. సంఘనాయకులు వెంకట్రావు, కృష్ణ, బోసు, వీరాంజనేయులు, సుబ్బరాజు, రత్నాకర్, సాయి,బాలకృష్ణ పాల్గొన్నారు.

దృఢసంకల్పంతో దేనినైనా సాధించగలం

● ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఆంథ్రూ


ప్రసంగిస్తున్న డాక్టర్ పి.ఆంథ్రూ

పెదకాకాని, మే 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించాలనే బలమైన లక్ష్యం కలిగి దృఢ సంకల్పంతో కృషిచేసినవారు తప్పక విజయం సాధిస్తారని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఆంథ్రూ అన్నారు. శనివారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో గల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో బ్యాంకు, ఆర్.ఆర్.బి, ఎస్.ఎస్.సి ఉద్యోగాలకు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల మూడో బ్యాచ్ ప్రారంభోత్సవ సభలో డాక్టర్ ఆంథ్రూ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సభకు కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత కమిషనర్ వై.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఆంథ్రూ ప్రసంగిస్తూ శిక్షణా తరగతులకు హాజరైన ప్రతి ఒక్కరు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. నేటి సమాజంలో అవినీతి, క్రమశిక్షణ రాహిత్యం బాగా ప్రబలిపోయాయని, నేటి యువత వాటికి అతీతంగా మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి నిరుద్యోగులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఈ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణారంగాలలో విశేష బోధనానుభవం గల అధ్యాపకులు ఈ తరగతులలో పాలుపంచుకుంటారన్నారు. మహిళా అభ్యర్థులకు ఉచిత వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. సభాధ్యక్షుడు వై.సత్యనారాయణ మాట్లాడుతూ కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఏ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహించినా ప్రమాణాల విషయంలో రాజీ ఉండబోతున్నారు. ఈ శిక్షణ తరగతులను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాసం డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ వ్యక్తులు పరిపూర్ణమైన వ్యక్తిత్వంగలవారుగా మారాలంటే ప్రతి ఒక్కరు తమలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. స్పష్టమైన లక్ష్యంతో కృషి చేసేవారే దేనినైనా సాధించగలరన్నారు. సమావేశంలో ఉచిత శిక్షణ తరగతులలో పాల్గొనే అధ్యాపకులు ఈ కోటేశ్వరరావు, ఈ అమర్నాథ్, సీహెచ్ఎస్ నవీన్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సభ్యులు వడ్డేగుంట సుబ్బారావు, పామర్తి సాంబశివరావు, వాకా రాంగోపాల్ గౌడ్, వీరంకి రంగారావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, డాక్టర్ తాతా సాంబశివరావు, డాక్టర్ సేవకుమార్, నారగాని కృష్ణ, డాక్టర్ లక్ష్మీదేవి, పి.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సింగారావు, పి.రామకృష్ణ, టి.ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

వెనిగండ్లలో నేడు ఉచిత వైద్య శిబిరం


గుంటూరు మెడికల్, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెనిగండ్ల బోసుబొమ్మ సెంటర్‌లోని సీతారామాంజనేయ దేవస్థానంలో జూన్ ఒకటో తేదీ ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు పంచకర్మ వైద్యనిపుణులు రోగులకు నాడి పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటిక, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సొరియాసిస్, ఫైల్స్, హెచ్ఐవీ/ఎయిడ్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇస్తారని ఆయన వివరించారు. ఈ అవకాశం స్థానిక ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు కోరారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులో పంచముఖ ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం విశేష పూజలు, మన్యసూక్త హోమం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. 145 మంది భక్తులు 108సార్లు చాలీసా పారాయణం చేశారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సంకీర్తన బృంద సభ్యులు పాల్గొన్నారు.


పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

టీసీఎస్ కంపెనీకి ఏఎస్ఎన్ విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్‌కు ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 48మంది ఎంపికయ్యారు. సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీసీఏ కోర్సు విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో వృద్ధుడు అదృశ్యం


కనకయ్య

పెదకాకాని, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెనిగండ్లలో వృద్ధుడు(70) అదృశ్యంపై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసినట్లు శనివారం తెలిపారు. వెనిగండ్ల గ్రామానికి చెందిన కే కనకయ్య గత నెల 23వ తేదీ నుండి కనిపించకుండా పోయారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. అతని కుమారుడు సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీని మరింత బలోపేతం చేద్దాం

● మహానాడు తీర్మానాలను ప్రతి ఒక్కరం పాటిద్దాం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామాల్లో తెలుగుదేశం పార్టీని రాబోయే రోజుల్లో మరింత బలోపేతం చేస్తూ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు విజయవంతంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ పేదవాడికి కూడు, గూడు, బట్టలు అందించి సమాజంలో మంచి స్థితిలో జీవించాలన్న ఆశయంతో పార్టీని స్థాపించారని చెప్పారు. నాడు ఎన్టీఆర్ దేశంలోనే ఎవ్వరూ చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అదే ఆనవాయితీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదవాడి సంక్షేమం పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినుండి దెబ్బతిన్న రాష్ట్రాన్ని పునఃనిర్మాణం వైపునడుపుతూ ముందుకు సాగుతున్నారన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం కూటమి పాలనపై ఎన్ని విధాలుగా అసత్య ప్రచారం చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదుల మహేష్, చినకోటిరెడ్డి, బోయపాటి అరుణ, అన్నం పిన్నారావు, దివి అనిత, సూర్యదేవర వెంకట్రావు, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో పేదల ఆరోగ్యానికి భరోసా

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): అనారోగ్యసమస్యలు ఉన్న పేదలు సైతం ఖరీదైన వైద్యసేవలు పొందేందుకు కూటమి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. శనివారం తెనాలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి నియోజవర్గంలోని 9మంది లబ్ధిదారులకు రూ.15,29,093 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థిని జాహ్నవికి లాప్‌టాప్‌ను అందజేస్తున్న నరేంద్ర

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

పొన్నూరుటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన చీమకుర్తి జాహ్నవికి శనివారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చేతుల మీదగా ల్యాప్‌టాప్ బహూకరణ జరిగింది. ఇంటర్మీడియట్ ఫలితాలలో జాహ్నవికి 97 శాతం మార్కులు రాగా ఉన్నత విద్య కోసం జాహ్నవికి 8వ వార్డుకు చెందిన కన్నెగంటి వాసు కుమారుడు హరీష్‌చౌదరి, పొన్నగంటి యశశ్విని, బ్రాహ్మణీలు, జాహ్నవికి ల్యాప్‌టాప్‌ను వితరణ చేశారు.